నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 10-11-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 90 | పేజీలు: 4 | వెల: రూ.1/-

జమ్మూకశ్మీర్‌లో 144 సెక్షన్.. ఇంటర్నెట్ సేవలు బంద్

శ్రీనగర్,నవంబర్9(ఆర్ఎన్ఎ): అయోధ్య కేసు తీర్పు నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 144 సెక్షన్ విధించిన పోలీసులు.. ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. రాజస్థాన్‌లో కూడా 144 సెక్షన్ విధించారు. 144 సెక్షన్ నవంబర్ 19 వరకు అమల్లో ఉండనుంది. అన్ని పాఠశాలలు, కళాశాలలకు రాజస్థాన్ ప్రభుత్వం సెలవులు

ప్రకటించింది. అజ్మీర్‌లో రేపు ఉదయం 6 గంటల వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మహారాష్ట్రలోనూ 144 సెక్షన్ విధించారు పోలీసులు. రేపు ఉదయం 11 గంటలకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. మొత్తంగా దేశ వ్యాప్తంగా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో భారీగా పోలీసులు మోహరించారు. 4 వేల కేంద్ర బలగాలు యూపీలో మకాం వేశాయి. ఈ బలగాలు నవంబర్ 19 వరకు యూపీలోనే ఉండనున్నాయి.

వివాదాస్పద స్థలం..రామజన్మభూమిదే

- ఆమోధ్యలో రామమందిరానికి సుప్రీం గ్రీన్‌సిగ్నల్
- 2.77ఎకరాల భూమి న్యాస్‌కు అప్పగించాలని వెల్లడి
- మందిర నిర్మాణానికి మూడునెలల్లో ట్రస్ట్
- అయోధ్యలోనే మసీదు నిర్మాణానికి ఐదెకరాల స్థలం
- స్థలాన్ని సున్నీ బోర్డుకు ఇవ్వాలన్న సుప్రీం

- ఏకగ్రీవంగా సంచలన తీర్పు ప్రకటించిన న్యాయస్థానం

- 1045 పేజీల్లో తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 9(ఆర్ఎన్ఎ) : దశాబ్దాల కాలం పాటు వివాదాలు, న్యాయస్థానాల మధ్య నలిగిన రామజన్మ భూమి, బాబ్రీ మసీదు వివాదంపై సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పును శనివారం వెల్లడించింది. అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని రామజన్మభూమి న్యాస్‌కు అప్పగించాలని, అప్పటి వరకు ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని సంచలన తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో అయోధ్య యాక్ట్ కింద ట్రస్ట్ మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయోధ్యలోనే మసీదు నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం ఇవ్వాలని సూచించింది. స్థలాన్ని సున్నీ బోర్డుకు ఇవ్వాలని ఆదేశించింది. భూ కేటాయింపునకు కేంద్రం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపింది. 1993లో ప్రభుత్వం సేకరించిన స్థలంలో అయినా సున్నీ బోర్డుకు స్థలాన్ని కేటాయించవచ్చని పేర్కొంది. జస్టిస్ గొగోయ్, జస్టిస్ బాబ్డే, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం భిన్నాభిప్రాయాలను తావు లేకుండా ఒకే తీర్పు ఇచ్చింది.

తీర్పు ఇలా సాగింది..

తొలుత వివాదాస్పద స్థలంపై షియా వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. రాముడు అయోధ్యలో జన్మించాడన్నది నిర్వివాదాంశమని. యాజమాన్య హక్కులనేవి నిర్దేశిత న్యాయ సూత్రాల ప్రకారం నిర్ణయిస్తామని చీఫ్ జిస్టిస్ రంజన్ గొగోయ్ వ్యాఖ్యానించారు. ప్రధాన గుమ్మటం కింద గర్భాలయం ఉందని హిందువులు విశ్వసిస్తున్నారని, రెండు మతాలు వివాదాస్పద స్థలంలో ప్రార్థనలు చేసేవని తెలిపారు. రాముడు అయోధ్యలోనే జన్మించాడని ముస్లింలు కూడా అంగీకరిస్తారన్నారు. మసీదు నిర్మాణానికి ముందే ఆ స్థలంలో ఒక నిర్మాణం ఉందని, వివాదాస్పద స్థలంలో మసీదు లేదని, అక్కడ హిందు నిర్మాణం ఉందని పురావస్తు విభాగం చెబుతోందని సుప్రీంకోర్టు పేర్కొంది. యాజమాన్య హక్కులనేవి నిర్దేశిత న్యాయ సూత్రాల ప్రకారం నిర్ణయిస్తామని, న్యాయమూర్తి ఆదేశాలు ఉన్నప్పుడే 47వ అధికరణం వర్తిస్తుందని చీఫ్ జస్టిస్ స్పష్టంచేశారు. 12 ఏళ్ల తర్వాత సున్నీ వక్ఫ్ బోర్డ్ వ్యాజ్యం దాఖలు చేసిందని, మొఘలుల సమయం నుంచే హక్కు ఉన్నట్లు నిరూపించలేకపోయిందని పేర్కొన్నారు.

శుక్రవారం రోజు ముస్లింలు ప్రార్థనలు చేసినట్లు మాత్రమే ఆధారాలు సమర్పించిందని వ్యాఖ్యానించారు. అయోధ్యలోని వివాదాస్పద స్థలాన్ని పంచుకోవాలంటూ గతంలో ఇచ్చిన అలహాబాద్ హైకోర్ట్ తీర్పును సుప్రీం కోర్టు తప్పు పట్టింది. వివాదాస్పద స్థలాన్ని పంచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. వివాదాస్పద భూమి మొత్తం రామ మందిర నిర్మాణానికి సుప్రీంకోర్టు కేటాయించింది. అయోధ్యలో ముస్లింలకు ఐదు ఎకరాల భూమి కేటాయించాలని యూపీ, కేంద్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మసీదు నిర్మాణం కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని ఏర్పాటు చేయాలని తెలిపింది. పురావస్తు శాఖ నివేదికల ఆధారంగా నిర్ణయం తీసుకుంటున్నామని సీజేఐ వెల్లడించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం వివాదాస్పద స్థలం ప్రభుత్వానికి చెందిందని పేర్కొన్నారు. వివాదాస్పద స్థలంపై ఎవరూ యాజమాన్య హక్కులు కోరలేదని వివరించారు. నిర్ణయానికి ముందు రెండు మతాల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకున్నామని సీజేఐ పేర్కొన్నారు. అక్కడ మందిరం ఉన్నట్లు పురావస్తు శాఖ నివేదికలు చెబుతున్నాయని తెలిపారు.

షియా వక్ఫ్ బోర్డ్, నిర్మోహీ పిటీషన్లు కొట్టివేత..

అయోధ్య భూమి హక్కుపై షియా వక్ఫ్ బోర్డ్ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ... ఏకగ్రీవ తీర్పు ఇచ్చింది సుప్రీంకోర్టు. వివాదాస్పద భూమి తమదేనని షియా వక్ఫ్ బోర్డు తన పిటిషన్‌లో తెలిపింది. దీన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడంతో... వివాదాస్పద భూమి షియా వక్ఫ్ బోర్డ్‌ది కాదని స్పష్టం చేసింది. తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్... ప్రజల విశ్వాసాల్ని, నమ్మకాల్ని సుప్రీంకోర్టు గౌరవిస్తుందని తెలిపారు. బాబర్ కాలంలో మసీదు నిర్మాణం జరిగిందన్న సుప్రీంకోర్టు... ఐతే... కచ్చితంగా మసీదు ఎప్పుడు నిర్మించిందీ స్పష్టం కాలేదని తెలిపింది. ఆర్టికల్ 120 కింద నిర్మోహీ అఖాడా వేసిన పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది. అందువల్ల హిందూ పార్టీల్లో ఒకటైన నిర్మోహీ అఖాడా వేసిన పిటిషన్ తొలగిపోయినట్లైంది. మసీదు నిర్మాణం ఖాళీ స్థలంలో జరగలేదన్న సుప్రీంకోర్టు... గతంలో అక్కడో నిర్మాణం ఉండేదని తెలిపింది. ఐతే... అక్కడ రామ దేవాలయమే ఉంది అనేందుకు ఆధారాలు లేవని పురావస్తు శాఖ తెలిపిన విషయాన్ని సుప్రీంకోర్టు ఏకీభవించింది. శ్రీ రామ్ లాలా విరాజ్‌మాన్ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు... మసీదు కింద నిర్మాణం ఉన్నంత మాత్రాన... ఆ భూమిపై హక్కును పొందే అవకాశం ఉండదని తెలిపింది. ఒకవేళ అక్కడ హిందూ ఆలయం ఉన్నా ఇదే వర్తిస్తుమంది అభిప్రాయపడింది.

సంతృప్తికరంగా లేదు.. అయినా గౌరవిస్తాం - సున్నీ వక్ఫ్ బోర్డు

అయోధ్య కేసులో సుప్రీంతీర్పుపై సున్నీవక్ఫ్ బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసిందని, వక్ఫ్ బోర్డు తరపు న్యాయవాది షేక్ అహ్మద్ సయ్యద్ మాట్లాడుతూ.. తీర్పు సంతృఎ్తికరంగా లేదని, అయినా గౌరవిస్తామన్నారు. తీర్పు కాపీని మరింత పరిశీలించాల్సి ఉందని.. ఆ తర్వాతే భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. అందరూ శాంతియుతంగా ఉండాలని, ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టరాదని ఆయన విజ్ఞప్తి చేశారు.

అయోధ్య తీర్పు చారిత్రాత్మకం - కేంద్ర మంత్రి రాజ్‌నాథ్

అయోధ్య రామ జన్మభూమి - బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమైనదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన ట్విటర్లో స్పందిస్తూ.. ఇది చారిత్రక తీర్పు అని నేను నమ్ముతున్నానని అన్నారు. ప్రతిఒక్కరూ దీన్ని అంగీకరించి, గౌరవించాలని అన్నారు. ప్రజలంతా శాంతి, సామరస్యాలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

సుప్రీం తీర్పు సంతృప్తికరంగా లేదు - ముస్లిం పర్సనల్ లా బోర్డు రియాక్షన్

సుప్రీంకోర్టు తీర్పుపై ముస్లిం పర్సనల్ లా బోర్డు స్పందించింది. అయితే ఇందులో తమకు ఆమోదయోగ్యం కాని విషయాలు కూడా ఉన్నాయని పేర్కొంది. మరొక్కసారి దృష్టి సారించాల్సిందిగా సుప్రీంకు విన్నవిస్తామని తెలిపింది. న్యాయపరంగా ఎలా అడుగువేయాలో త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తమకు సంతృప్తికరంగా లేదన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో చర్చించాల్సిన విషయాలు ఉన్నాయని, 15వ శతాబ్దానికి ముందు ఆధారాలు ఉన్నాయి అంటే.. 15వ శతాబ్దం తర్వాత కూడా ఆధారాలు ఉంటాయి కదా అని ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రశ్నించింది. తీర్పు పూర్తి సారాంశం చదివిన తరువాత తమ నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.

విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దు - బాబా రాందేవ్

దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న అయోధ్య తీర్పును సుప్రీం కోర్టు వెలువరించిన నేపథ్యంలో ఎవరూ మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టవద్దని యోగ గురు బాబా రాందేవ్ ప్రజలను కోరారు. ప్రజలంతా శాంతియుతంగా ఉండాలని, సుప్రీం తీర్పును గౌరవించాలని విన్నవించారు. భారత దేశంలో నివశించే వివిధ మతాల ప్రజలందరూ కలిసిమెలిసి, శాంతియుతంగా జీవిస్తారని, మన దేశం పూర్తి స్థాయి ప్రజాస్వామ్య దేశమని ప్రపంచానికి నిరూపించాలని పిలుపునిచ్చారు.

అయోధ్య తీర్పు కేంద్రం గొప్పతనమేమీ కాదు - ఉద్ధవ్ థాకరే

అయోధ్య తీర్పు కేంద్రం గొప్పతనమేమీ కాదని శివసేన అధినేత ఉద్ధవ్ థాకరే విమర్శించారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం గురించి తాము ఎప్పుడో కేంద్రాన్ని కోరామని, అయితే కేంద్రం పట్టించుకోలేదని ఆయన చెప్పారు. అలాంటిది ఇప్పుడు రామ జన్మభూమిని రామునికే ఇస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో అదంతా తమ గొప్పతనమేనంటూ కేంద్రం చెప్పుకోకూడదని ఆయన హితవు పలికారు.

సుప్రీం తీర్పును గౌరవించండి - రామమందిర్ ప్రధాన అర్చకుడు సత్యేంద్ర

అయోధ్యపై సుప్రీం కోర్టు తీర్పును అందరూ గౌరవించాలని రామమందిర్ ప్రధాన అర్చకుడు సత్యేంద్ర దాస్, ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డ్ కార్యదర్శి ఖలీద్ రషీద్ శనివారం కోరారు. సుప్రీం తీర్పును ప్రజలంతా ఏకగ్రీవంగా ఆమోదించాలని, దీనిని ఎవరో ఒకరి గెలుపుగానో, ఓటమిగానో చూడవద్దని సత్యేంద్ర దాస్ విన్నవించారు. అలాగే అయోధ్యలో శాంతి భద్రతలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం రక్షణ దళాలను మోహరించడం పై ఆనందం వ్యక్తం చేశారు. ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు ఖలీద్ రషీద్ మాట్లాడుతూ ఎంతో కాలంగా దేశం మొత్తం ఎదురు చూస్తున్న రోజు వచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును ప్రజలంతా ఆమోదించాలని కోరారు. అలాగే దేశంలోని పార్టీలు, నాయకులు, ఆర్ఎస్ఎస్, జమాత్ ఉలేమా ఈ హిందూ వంటి సంస్థలు అయోధ్య పట్ల వ్యవహరిస్తున్న తీరును అభినందించారు.

సుప్రీం తీర్పును అందరూ గౌరవించాలి - సీపీఐ నేత సురవరం

అయోధ్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అందరూ గౌరవించాలని సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సుప్రీం తీర్పు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.. సుప్రీంకోర్టు ధర్మాసనం తన విచక్షణతో ఇచ్చిన తీర్పు ఇదన్నారు. తీర్పు అందరినీ సంతృప్తి పరచలేకపోయినా అత్యున్నత న్యాయస్థానాన్ని గౌరవించాలన్నారు. ప్రజలంతా శాంతి, సహనంతో ఉండాలని ఈ సందర్భంగా సురవరం పిలుపునిచ్చారు.

సంయమనం పాటించండి - ఏపీ సీఎం జగన్

అయోధ్యలోని రామజన్మభూమి- బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ప్రజలంతా సంయమనం పాటించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అయోధ్యలో నిర్మాణంపై తీర్పునకు కట్టుబడి ఉంటామని ఇరుపక్షాలూ సుప్రీంకోర్టుకు తెలియజేసిన మీదటే.. ఈ కేసులో భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించిందన్నారు. ఇటువంటి పరిస్థితులలో మత సామరస్యానికి భంగం కలిగించేలా, రెచ్చగొట్టేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయరాదని అన్ని వర్గాలకూ విజ్ఞప్తి చేశారు. సంయమనం పాటించి శాంతి భద్రతలకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

అద్వానీ, సింఘాల్ సాధించారు - కేఎన్ గోవిందాచార్య

అయోధ్య వివాదంలో సుప్రీంకోర్టు తీర్పును ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త, రామ జన్మభూమి రథయాత్రలో కీలక పాత్రధారి కేఎన్ గోవిందాచార్య స్వాగతించారు. ఈ కేసులో తీర్పు తమకు అనుకూలంగా రావడానికి విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) నేత అశోక్ సింఘాల్, ఎల్‌కే అద్వానీ చేసిన కృషే కారణమని ఆయన వ్యాఖ్యానించారు. 'సుప్రీంకోర్టు తుది తీర్పు చాలా సంతోషం కలిగించింది. ఇక మూడు నెలల్లో రామమందిరం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని ఆయన అన్నారు. ప్రజలంతా సంయమనంతో మెలగాలని, మత సామరస్యం పాటించాలని కోరారు. ఈ విజయానికి ప్రధాన కారణం ఎవరు అనుకుంటున్నారని ప్రశ్నించగా.. ఆలయ నిర్మాణం కోసం లక్షలాది మంది త్యాగాలు చేశారని, చాలా మంది అనేక రకాలుగా రామ జన్మభూమి ఉద్యమంలో తమ పాత్ర పోషించారు. కీలక భూమిక మాత్రం అశోక్ సింఘాల్, ఎల్‌కే అద్వానీదే అని సమాధానం ఇచ్చారు. అదేవిధంగా అయోధ్య వివాదంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమని హిందూ మహాసభ తరపు న్యాయవాది వరుణ్‌కుమార్ సిన్హా వ్యాఖ్యానించారు. భిన్నత్వంలో ఏకత్వం సందేశాన్ని ఇచ్చేలా తీర్పు ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు బాలెన్స్‌డ్‌గా ఉందని, ఇది ప్రజల విజయమని రామ్ లల్లా తరపు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ అన్నారు.

పాక్ ప్రధాని ఇమ్రాన్‌కు..

కృతజ్ఞతలు తెలిపిన మోదీ

- కర్తార్‌పూర్ కారిడార్‌కు సహకరించటం సంతోషంగా ఉంది
- గురునానక్ దేవ్ పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక రైలు
- ప్రధాని నరేంద్ర మోదీ
- కర్తాపూర్ కారిడార్‌ను ప్రారంభించిన మోదీ

ఛండీఘర్, నవంబర్9(ఆర్ఎన్ఎ) : కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణం కోసం సహకరించిన పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృతజ్ఞతలు తెలిపారు. పాక్ ప్రధానితో పాటు పంజాబ్ ప్రభుత్వం, ఎస్‌జీపీసీతో పాటు కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. సిక్కు మత వ్యవస్థాపకుడు గురు నానక్ దేవ్ 550వ జయంతి సందర్భంగా కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించేందుకు శనివారం ఆయన పంజాబ్‌లోని సుల్తాన్‌పూర్ లోధి వచ్చారు. దేరా బాబానానక్‌ను సందర్శించి ఇక్కడి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు (ఐసీపీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. గురుబనీని ప్రపంచంలోని పలు భాషల్లోకి తర్జుమా చేస్తున్నామని, ఈ పనికి చొరవతీసుకున్న యునెస్కోకి కృతజ్ఞతలు తెలిపారు. గురు నానక్ దేవ్‌పై పరిశోధనలను ప్రోత్సహించేందుకు బ్రిటన్‌లోని ఓ యూనివర్సిటీ, కెనడాలోని మరో యూనివర్సిటీ కృషిచేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. గురు నానక్ దేవ్‌కి సంబంధించిన అన్ని పుణ్య క్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక రైలు సేవలను ప్రారంభించనున్నట్టు ప్రధాని మోదీ తెలిపారు. అమృత్‌సర్, కేశ్‌ఘర్, ఆనంద్‌పూర్, డామ్‌దమ, పాట్నా, నాందేడ్‌లలోని సిక్కు పవిత్ర క్షేత్రాలను కలుపుతూ రైల్వేశాఖ కొత్త రైళ్లను నడపనున్నట్టు ఆయన పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్, లద్దాక్‌లలో ఆర్టికల్ 370రద్దుతో సిక్కులకు విశేష లబ్ది చేకూరుతుందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలంతా దేశ ప్రజలతో సమానంగా హక్కులను పొందుతారన్నారు. అంతకు ముందు పంజాబ్‌లోని సుల్తాన్‌పూర్ లోధిలో ఉన్న బేర్ సాహిబ్ గురుద్వారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందర్శించారు. కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవంలో భాగంగా తొలుత ఆయన గురుద్వారాలో పూజలు చేశారు. గురుదాస్‌పూర్‌లోని దేరా బాబా నానక్ వద్ద భారత్ వైపున ఉన్న కారిడార్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనుండగా.. పాకిస్థాన్ వైపున ఉన్న కారిడార్‌ను ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రారంభించనున్నారు. ఇక్కడికి వెళ్లడానికి భారత పర్యాటకులకు వీసా అవసరం లేదు. ప్రారంభోత్సవం, గురునానక్ జయంతి రోజున వెళ్లే యాత్రికులు ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని పాకిస్థాన్ ఇప్పటికే ప్రకటించింది.

దశాబ్దాల వివాదానికి తెరపడింది - కేంద్ర మంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, నవంబర్9(ఆర్ఎన్ఎ) : అయోధ్యలోని రామ జన్మభూమి- బాబ్రీ మసీదు వివాదంపై సుప్రీంకోర్టు శనివారం వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి రగులుతున్న వివాదానికి ఈ తీర్పు ముగింపు పలుకుతుందని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమిపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఒక్క భారత్, గొప్ప భారత్ నినాదానికి కట్టుబడి అన్ని మతాలు, వర్గాలు ఈ తీర్పును స్వాగించాలన్నారు. అందరూ శాంతి, సామరస్యాలను పాటించాలని, సుప్రీం నిర్ణయం దేశ సమైక్యత, సమగ్రత, సంస్కృతిని బలోపేతం చేయగలదని నమ్ముతున్నామని అమిత్ షా ట్వీట్ చేశారు.

భారతభక్తిని బలోపేతం చేద్దాం

- సుప్రీం తీర్పు ఏ ఒక్కరికీ విజయం.. ఓటమి కాదు
- చట్టం ముందు అందరూ సమానులేనని తీర్పు చాటింది
- ట్విటర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, నవంబర్9(ఆర్ఎన్ఎ) : సుప్రీం తీర్పు ఏ ఒక్కరికీ విజయం కానీ.. ఓటమి కాదని.. రామ భక్తి అయినా.. రహీమ్ భక్తి అయినా ఒకపై భారతభక్తిని బలోపేతం చేయాల్సిన సమయమిదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అయోధ్యలో రామజన్మభూమి - బాబ్రీమసీదు భూవివాద స్థలంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ తీర్పు ఏ ఒక్కరికీ విజయంగానీ.. ఓటమిగానీ కాదని పునరుద్ఘాటించారు. రామభక్తి అయినా.. రహీమ్‌భక్తి అయినా ఇకపై భారతభక్తిని బలోపేతం చేయాల్సిన సమయం ఇదని మోదీ అన్నారు. ఈ సందర్భంగా దేశవాసులంతా శాంతి, సామరస్యాల్ని పరిరక్షిస్తూ.. భారతదేశ ఏకత్వాన్ని చాటాలని, నేడు వెలువరించిన సుప్రీం కోర్టు తీర్పు అనేక రకాలుగా ప్రాముఖ్యమైనదన్నారు. ఎలాంటి వివాదమైనా చట్టబద్ధమైన పక్రియ ద్వారా అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించవచ్చునని నిరూపితమైందని ప్రధాని తెలిపారు. అలాగే ఈ తీర్పు భారత న్యాయవ్యవస్థ స్వతంత్రత, పారదర్శకత, దూరదృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని ఈ తీర్పు మరోసారి చాటి చెప్పిందన్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న ఈ సమస్యన్ని న్యాయస్థానం అందిరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించిందన్నారు. ఈ కేసులో ప్రతి వర్గానికి తగు సమయం కేటాయించారు. భిన్న వాదనలు, అభిప్రాయాలకు చోటుకల్పించారన్నారు. దీంతో న్యాయవ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసం మరింత పెరుగుతుందని, తీర్పు నేపథ్యంలో దేశవ్యాప్తంగా 130కోట్ల మంది ప్రజలు పాటిస్తున్న సంయమనం.. శాంతి కోసం ప్రజలు కట్టుబడి ఉన్నారన్న విషయాన్ని తెలియజేస్తోందని ప్రధాని తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని అయోధ్య తీర్పుపై ట్విటర్ వేదికగా మోదీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

చరిత్రలో నేటినిజం



కం॥ రవళించు భారతమునకు
జవసత్వంబులనాసంగి చరితార్థుండై
భువి జను తారిచి దిద్దెను
నవపథ చరియను సురేంద్రనాథ చెనళ్ళ !!

(నవంబర్ 10 సురేంద్రనాథ బెనర్జీ జయంతి)

-రాధశ్రీ
సెల్: 9494481210

కొనసాగుతున్న అరెస్టులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీ బందోబస్తు

25మంది అరెస్ట్

హైదరాబాద్, నవంబర్9(ఆర్ఎన్ఎ): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు చేరుకున్న క్రమంలో వరంగల్‌కు చెందిన 25 మంది ఆర్టీసీ జేఏసీ నేతల్ని గోపాలపురం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే.. 'చలో ట్యాంక్‌బండ్' కార్యక్రమానికి పోలీసుల అనుమతి లభించలేదన్న విషయం తెలిసిందే. దీంతో పోలీసులు శుక్రవారం నుంచే కార్మికులు, కార్మిక నేతలను ఎక్కడికక్కడే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు.

సుప్రీం తీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాలి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, నవంబర్9: వివాదాస్పద అయోధ్య భూవివాదం కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాలని కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. అయోధ్య తీర్పుపై రాహుల్ స్పందిస్తూ.. దేశంలోని ప్రతిఒక్కరూ సామరస్యాన్ని చాటుతూ సోదర భావం పెంపొందేలా నమ్మకం, ప్రేమతో మెలగాలన్నారు. అయోధ్య వివాదాస్పద స్థలం హిందువులదేనని పేర్కొంటూ ఐదుగురు జడ్జీలుగా గల సుప్రీం ధర్మాసనం నేడు ఏకగ్రీవంగా తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

సుప్రీం తీర్పుతో సంతృప్తిగా లేము

- ఆ ఐదెకరాలు మాకొద్దు
- ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ

న్యూఢిల్లీ, నవంబర్9(ఆర్ఎన్ఎ) : అయోధ్య స్థల వివాదంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తాము సంతృప్తిగా లేమని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు సుప్రీమే కానీ, అమోఘం కాదని అన్నారు. మసీదు నిర్మాణం కోసం ఐదు ఎకరాల ఆఫర్‌ను తిరస్కరించాలని అన్నారు. 'ఐదు ఎకరాల ఆఫర్ బెగ్గింగ్ కాదని ఆయన వ్యాఖ్యానించారు. లీగల్ హక్కుల కోసమే తాము పోరాడామన్నారు. ఏఐఎంపీఎల్‌బీ వాదనతో తాము ఏకీభవస్తున్నామని చెప్పారు. 'వాస్తవాల మీద విశ్వాసాలే గెలిచాయని తీర్పుపై స్పందించారు. తీర్పును సవాలు చేసే విషయంపై ముస్లిం పర్సనల్ లా బోర్డు నిర్ణయం తీసుకుంటుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అయోధ్య తీర్పును స్వాగతించిన ఆరెస్సెస్

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టు తీర్పును ఆరెస్సెస్ స్వాగతించింది. ఈ తీర్పు ఏ ఒక్కరి విజయమో..ఓటమో కాదని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు పట్ల అందరూ శాంతి, సంయమనంతో వ్యవహరించాలని కోరారు. అయోధ్య కేసులో తీర్పు జాప్యమైనా తాజా తీర్పును స్వాగతిస్తామని అన్నారు. మసీదు, మందిరం పక్కనే ఉన్నా ఎలాంటి సమస్య ఉండబోదని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరిస్తామని స్పష్టం చేశారు. అయోధ్య వివాదంపై గతంలో మధ్యవర్తిత్వ పక్రియ విఫలమైందని అన్నారు. భారతీయులను హిందూ, ముస్లింలుగా తాము చూడబోమని చెప్పారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం: బాబారాందేవ్

అయోధ్య కేసులో సుప్రీం తీర్పు చారిత్రాత్మకమని యోగా గురు బాబా రాందేవ్ వ్యాఖ్యానించారు. మతాలు వేరైనా మనమంతా రాముడి వారసులమేనని అన్నారు. సుప్రీం తీర్పుతో అయోధ్య వివాదాలన్నీపరిష్కారమైనట్టేనని చెప్పారు. అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో దేశంలో శాంతి నెలకొనాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో శాంతి స

మాతృభాషల మాధ్యమంగా విద్యాబోధన జరగాలి.

నేటినిజం
ఆదివారం 10-11-2019

అన్ని భారతీయ భాషలలోనూ అవే అక్షరాలు, అదే అక్షర క్రమం. ఎందుకంటె భారతీయ భాషలన్నీ ఒకే 'సంస్కృత భాషా కుటుంబాని'కి చెందిన అక్కచెల్లెళ్లు, తల్లి సంస్కృత భాష. 'జనని సమస్త భాషలకు సంస్కృత భాష ధరాతలమునన్' అన్న వాస్తవాన్ని భారతజాతి సహస్రాబ్దుల పాటు, సహస్రాబ్దులతో కూడిన యుగాలపాటు పరిగణించడం చరిత్ర. సంస్కృత భాషకు మూల లిపి అయిన 'బ్రాహ్మీ' నుంచి అన్ని భారతీయ భాషల 'లిపులు' రూపాంతరం చెందాయి. అందువల్లనే అన్ని భారతీయ భాషల అక్షర క్రమం కూడ ఒకే విధంగా ఉంది. అక్షరాల సంఖ్యలో తేడాలు ఉండవచ్చు. కానీ 'అ' నుంచి 'హ' వరకూ గల అక్షర క్రమం అన్ని భాషలకూ సమానం! విదేశాల నుంచి మన దేశానికి విస్తరించిన భాషలలో ప్రధానంగా ఈ అక్షర క్రమం లేదు. భారతీయ భాషలన్నింటిలోను 'అక్షర రమ్యత' ఉంది, అక్షర ధ్వనికి, పద ధ్వనికి మధ్య సమానత్వం ఉంది. 'అమ్మ' అనే అక్షరాల ధ్వని, 'అమ్మ' అనే పద ధ్వని– ఉచ్చారణ– ఒకే విధంగా ఉన్నాయి. విదేశాల నుంచి వచ్చిన భాషలలో ప్రధానంగా ఆంగ్లభాషలో ఈ సమన్వయం లేదు. సమానత్వం లేదు. అక్షరాల ఉచ్చారణ– ధ్వని– వేఱు, అక్షరాల సమాహారమైన పదాల ధ్వని– ఉచ్చారణ వేఱు! ఇదంతా మాతృభాషల చరిత్రతో ముడిపడిన వ్యవహారం. ఈ చరిత్రను మన దేశాన్ని ఆర్థికంగా భౌతికంగా సాంస్కృతికంగా దివాలా తీయించిన బ్రిటన్ దురాక్రమణకారులు చెఱచిపోయారు. ఈ 'చెడబాటు' దశాబ్దులుగా బ్రిటన్ దురాక్రమణ విముక్త భారతదేశమంతటా వ్యవస్థీకృతమై ఉండడం జాతీయ వైపరీత్యం! 'బాబా బ్లాక్‌షీప్' అని మూడేళ్ల పిల్లలు పాఠశాలల్లో వల్లె వేస్తుండడం ఈ 'చెడబాటు'! సూర్యోదయంతో మొదలు కావలసిన 'కాలగణన' అర్ధరాత్రి కారుచీకటితో మొదలవుతుండడం ఈ 'చెడబాటు'. ఈ 'చెడబాటు'ను సరిదిద్దడానికి అనేకమంది జాతీయభావ నిష్ఠులు, జాతీయ సాంస్కృతిక ఉద్యమ సంస్థలు కృషి చేస్తుండడం సమాంతర శుభ పరిణామం. శనివారం నుంచి మూడురోజులు దేశ రాజధానిలో జరుగుతున్న 'విశ్వ సంస్కృత సమ్మేళనం' ఈ కృషిలో భాగం.. 'సంస్కృత భారతి' సంస్థవారు ఢిల్లీలోని ఛాత్రపుర దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ సంస్కృత భాషా సమ్మేళనంలో దేశ విదేశాలకు చెందిన దాదాపు నాలుగు వేలమంది ప్రతినిధులు పాల్గొంటున్నారట. అధ్యాపకులు మేధావులు విద్యాధికులు శాస్త్రవేత్తలు మాత్రమే కాక ఇళ్లలో సంస్కృత భాషను నేర్పుతున్న కుటుంబాల నుంచి కూడ ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొంటున్నారట. సంస్కృత భాష కేవలం విద్వత్ భాష కాదన్న, ఇప్పటికీ దేశవ్యాప్తంగా కొన్నివేల కుటుంబాల వారి నిత్య వ్యవహార భాష సంస్కృతమన్న వాస్తవానికి తగిన ప్రచారం లేదు. పిఎన్ బక్, కోట వెంకటాచలం వంటి చరిత్రకారులు 'ఒకప్పుడు ప్రపంచమంతటా సంస్కృత భాష వ్యవహార భాషగా ఉండేదన్న' వాస్తవాన్ని తమ గ్రంథాలలో వివరించారు. భారతీయులు వ్రాసిన చరిత్రను, వివరించిన భాషా వికాస క్రమాన్ని భారతీయులే నమ్మని దుస్థితి ఇప్పుడు దాపురించింది. ఇందుకు కారణం బ్రిటన్ బీభత్స పాలకులు నిర్వహించిన దుర్మార్గం. అజ్ఞానం, అహంకారం స్వభావమైన ఆంగ్లేయులు సంస్కృత భాషను దశలవారీగా నిర్మూలించి, సంస్కృత భాష స్థానంలో ఆంగ్లభాషను ప్రవేశపెట్టారు. ఇది మన దేశ ప్రజల ఇష్టంతో జరగలేదు. బ్రిటన్ దొరలు మన దేశ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా సంస్కృత భాషను నిర్మూలించి ఆంగ్లభాషను ప్రవేశపెట్టారు. అంతవరకు సంస్కృత భాషా మాధ్యమంగా జరిగిన సకల వ్యవహారాలు ఆంగ్లభాషలో జరగడం మొదలైంది..!

బ్రిటన్ దురాక్రమణకారులు దేశం నుంచి నిష్క్రమించిన తరువాత– వారి దురాక్రమణకు పూర్వం నాటి భాషా వ్యవస్థను మనం పునరుద్ధరించుకోవలసి ఉంది. క్రీస్తు శకం పన్నెండవ శతాబ్ది నుంచి విదేశీయ 'జిహాదీ'ల బీభత్సపాలనకు గురి అయిన చోట్ల సంస్కృతం ప్రాధ్యాతన కొంత తగ్గింది. అందువల్లనే బ్రిటన్ బీభత్సకారుల నుంచి విముక్తమైన తర్వాత దేశంలో సంస్కృత భాషను కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా, అనుసంధాన భాషగా, ఉన్నత విద్యాబోధన మాధ్యమభాషగా పునరుద్ధరించాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిపాదించాడు. ఆ మహనీయుని ప్రతిపాదనను రాజ్యాంగ పరిషత్ ఆమోదించి ఉంటే భారతీయులు భారతీయులుగా జీవించడానికి ప్రాతిపదిక ఏర్పడి ఉండేది. ఆయన ప్రతిపాదనను రాజ్యంగ పరిషత్ తిరస్కరించడం చారిత్రక మహాపరాధం! ఇప్పుడైన దేశమంతటా ఎనిమిదవ తరగతి వరకు ప్రాంతీయ మాతృభాషల మాధ్యమంగా విద్యాబోధన జరగాలి. సంస్కృత భాషను ఒకటవ తరగతి నుంచి దేశమంతటా నేర్పించాలి. తొమ్మిదవ తరగతి నుంచి దేశమంతటా ఉన్నత విద్యను సంస్కృత భాష మాధ్యమంగా బోధించాలి. కనీసం ఇప్పుడైన ఈ వ్యవస్థ ఏర్పడితే మళ్ళీ భారతీయత నిలబడుతుంది.

మాతాశిశు సంరక్షణకు చర్యలు

–క్షేత్రస్థాయిలో శిక్షణా కార్యక్రమాలు

వరంగల్,నవంబర్9(ఆర్ఎన్ఎ): మాతా శిశు మరణాలను తగ్గించి మానవ అభివృద్ధి సూచికను పెంపొందించ డానికి సెర్ప్ నడుం బిగించింది. ఐసీడీఎస్, మెడికల్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పౌష్టికాహారం, పరిశుభ్రత, మంచినీరు, విద్య వంటి అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో పైలట్‌గా తీసుకున్న ఏడు మండలాల సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ వేయిరోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు గర్భం దాల్చినప్పటి నుంచి శిశువుకు రెండేళ్ల వయసు వచ్చే వరకు వేయి రోజుల పాటు ఈ శిక్షణ గ్రామాలలో కొనసాగుతుందని డీఆర్‌డీవో సూర్యనారాయణ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా త్వరలోనే అన్ని మండలాల్లో ప్రత్యేక కార్యక్రమంగా దీనిని చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ శిక్షణ మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు గర్భం దాల్చిన రోజు నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వయసు వచ్చే వరకు ఇలా వెయ్యి రోజుల కార్యాచరణను అమలు చేస్తారు. గర్భిణులు ప్రసవమయ్యేంత వరకు తీసుకోవాల్సిన పోషకాహారం, ప్రసవానంతరం ఏడాది పాటు చిన్నారికి ఇవ్వాల్సిన టీకాలు, మందులపై అవగాహన కల్పిస్తారు. ఏడాది నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఇవ్వాల్సిన ఆహారంపై శిక్షణ ఇస్తారు. వేయిరోజుల ఆరోగ్య పరిరక్షణ కింద ఏపీఎం, సీసీలు, వీఏవోలకు శిక్షన కొనసాగుతోంది...వీరందరికీ రిసోర్స్ పర్సన్స్ శిక్షణిస్తారు. వారే మండల సిబ్బందికి, మండల సిబ్బంది ఆయా గ్రామపంచాయతీల్లో మహిళలకు అవగాహన కల్పిస్తారు. యుక్త వయస్సు ఆడపిల్లల ఆరోగ్యం, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు మానసిక, శారీరక పెరుగుదల సరిగా ఉండాలన్నదే దీని ప్రధాన లక్ష్యం. ఇందుకోసం జిల్లాలోని ఏడు మండలాలను పైలట్ మండలాలుగా ఎంపిక చేసి, ఆటపాటలతో సంఘ మహిళలకు శిక్షణ అందించడానికి అవసరమైన శిక్షణ మెటీరియల్‌ను తయారు చేసి కిట్‌లను ప్రతీ వీఏవో, సీసీలకు అందించడం జరిగింది. వీరు ప్రతినెలా ఒక టాపిక్‌పై 3,4 సంఘాలకు ఒక సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తారు. మహబుబాబాద్ జిల్లాలో పైలెట్ మండలాలుగా నర్సింహులపేట, దంతాలపల్లి, డోర్నకల్, కురవి, బయ్యారం, మరిపెడ, చిన్నగూడూరు, మండలాలను ఎంపిక చేశారు. మిగతా 9మండలాలల్లో వచ్చే నెలలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. జిల్లాల్లోని డీఆర్‌డీఏ–ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో ఆయా మండలాల పరిదిలో ఉన్న ఏపీఎంలు, సీసీలు, వీఏవోలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ శిక్షణ కొనసాగుతోంది. గ్రామపంచాయతీల్లో సెర్ప్ ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఫ్లకార్డులు, పామునిచ్చెన, తల్లిపాల ప్రాధాన్యం, చేతుల శుభ్రత విధానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రతి శిక్షకుడికి ఒక కిట్‌ను అందజేస్తారు. ప్రసవమైన తర్వాత చిన్నారికి టీకాలు, పోషకాహారం, చక్కగా అందిస్తే వారిని స్టార్ అమ్మగా పిలుస్తారు. సంఘం సమావేశాల్లో ఆమెతోనే శిక్షణ ఇప్పిస్తారు. పుట్టిన చిన్నారికి వెంటనే ముర్రిపాలు తాగించడం, ఆరునెలలు నిండగానే తల్లిపాలతో పాటు, తగినంత అనుబంధ పోషకాహారం, తరచుగా కొద్దికొద్దిగా చిన్నారికి తినిపించడం, విటమిన్ ఏ ద్రావణం 5నెలల నుంచి అందించడం, అయోడిన్ ఉప్పును వాడటం, ఏడాదిలోపు క్రమం తప్పకుండా అన్నిరకాల టీకాలను అందించడం, శిశు సంరక్షణ విషయంలో చేతులను శుభ్రంగా కడుక్కునే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

కొత్త పంచాయతీల్లో అందుబాటులో లేని రేషన్ దుకాణాలు

–ప్రభుత్వం హామీ ఇచ్చిన సాకారం కాని షాపులు

ఆసిఫాబాద్, నవంబరు9(ఆర్ఎన్ఎ): కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటు చేసిన గూడాలు, తండాలలో చౌక ధరల దుకాణాల ఏర్పాటు అంశం నేటికీ కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీలలో చౌకధరల దుకాణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి 14 నెలలు గడుస్తోంది. అయినా ఇప్పటి వరకు కదలిక లేదు. దాంతో ఏజెన్సీవాసులు పాత పంచాయతీలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోక తప్పని పరిస్థితులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పలు ఏజెన్సీ గ్రామాల ప్రజలు కొన్ని చోట్ల పది నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే తప్ప నిత్యావసర సరుకులు పొందలేని పరిస్థితి కొనసాగుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 1,25,412 రేషన్ కార్డులు ఉండగా 278 చౌకధరల దుకాణాల ద్వారా ప్రతి రేషన్ కార్డు మీద మనిషికి ఆరు కిలోల చొప్పున 298 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అయితే గతంలో మ్యానవల్ పద్ధతిలో రేషన్ సరుకులు ఇచ్చినప్పుడు ఒకరిద్దరు వ్యక్తులు ఇరుగుపొరుగు వారి రేషన్ సరుకులు కూడా తీసుకు వెళ్లే పరిస్థితులు ఉండేది. ఈ–పాస్ విధానం అమలులోకి తెచ్చిన తరువాత రేషన్ సరుకులను తప్పనిసరిగా లబ్దిదారులే తీసుకోవాలి. దీంతో పనులన్నీ మానుకుని పాత పంచాయతీలకు వచ్చి రేషన్ సరుకులు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని లబ్దిదారులు వాపోతున్నారు. గతంలో ఉన్న 173 పంచా యతీల పరిధిలో దాదాపు 1,033 రెవెన్యూ గ్రామాలు ఉండేవి. అప్పట్లోనే పాత పంచాయతీలకు వచ్చి రేషన్ సరుకులు తీసుకు వెళ్లేందుకు ప్రజలకు మూడు నుంచి నాలుగు మైళ్ల ప్రయాణం చేస్తే తప్ప సరుకులు అందని పరిస్థితి. అయితే గతేడాది ఆగస్టు 3వ తేదీన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ప్రభుత్వ నిర్ణయం అమలు కాకపోవడంతో రేషన్ సరుకుల కోసం పాత పంచాయతీ కేంద్రాలే నేటికీ దిక్కుగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా కెరమెరి, జైనూరు, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి, వాంకిడి వంటి మండలాల్లో రేషన్ షాపులకు, కొత్త పంచాయతీలకు మధ్య పదేసి కిలో మీటర్ల దూరం ఉంటోందని ఇలాంటి గ్రామాల్లో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. మరీ ముఖ్యంగా వర్షాకాలం సీజన్‌లో చిన్న వాగులు, వంకలు కూడా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగులు దాటి ప్రాణాలను పనంగా పెట్టి రేషన్ సరుకులు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏజెన్సీ గ్రామాల్లో కొనసాగుతోంది. మెజార్టీ గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండడంతో కొన్ని సందర్భాల్లో కాలినడకన కూడా వెళ్లే పరిస్థితులు లేవు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ దుకాణాలకు, కొత్త పంచాయతీల లబ్దిదారుల మధ్య ఉత్పన్నమవుతున్న సమస్యలపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న స్పెషల్ ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు మూడు కిలోమీటర్ల దూరం కాలినడకన రాక పోకలు నిర్వహిస్తూ నిత్యావసర సరకుల్ని తెచ్చుకుంటున్నారు. అదేవిధంగా మరికొన్ని గ్రామ పంచాయతీల లబ్దిదా రులు నిత్యావసర సరకుల కోసం ఆటోలో రాకపోకలు నిర్వహిస్తూ రూ. 15 అదనంగా ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నూతన షాపులను ఏర్పాటు చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు.

కేసీఆర్ అనుకున్నదొక్కటి...జరుగుతున్నది మరొకటా?

హైదరాబాద్, నవంబర్ 9:ముఖ్యమంత్రి డెడ్‌లైన్లను బేఖాతరు చేస్తూ ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా చేస్తున్న సమ్మె విజయవంతంగా సాగుతోంది. అయితే ఈ 36 రోజుల సమ్మెలో ఎవరిది పైచేయి ? ఇప్పటి వరకైతే ఆర్టీసీ కార్మికులదే అని చెప్పక తప్పది. గత ముప్పయ్ ఆరు రోజులుగా నెలకొన్న పరిస్థితిలు ...జరుగుతున్న పరిణామాలను గమనించిన ఎవరికైనా అదే అనిపిస్తున్నంది. నయానో భయానో సమ్మె విరమింపజేయాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించలేదు సరికదా ప్రభుత్వమే అభాసుపాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ ఉద్యోగులును ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో సమ్మె మొదలైనప్పటికీ ఇప్పుడు అది పక్కకు జరిగి ఆర్టీసీ ప్రైవేటీకరణ బలంగా తెరమీదకు వచ్చింది. దాదాపు అన్నిపార్టీలు ..ప్రజా సంఘాలు సమ్మెకు అండగా నిలబడ్డాయి. ఆర్టీసీ సమ్మె రాజకీయ రంగు పులుముకోవటంతో ప్రభుత్వం కూడా మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. ఇదే సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతుండటంతో సర్వత్రా సర్కార్ వైఖరినే తప్పు పడుతున్నారు. కనీసం చర్చలకు కూడా ఆహ్వానించకపోవటం రాష్ట్ర ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఒకప్పుడు ఆర్టీసీకి ఎంతో సన్నిహితుడైన ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖరరావు ఇప్పుడు ఎందుకు ఇంత కఠినంగా వ్యవహరిస్తున్నారన్నది ఎవరికీ అంతుబట్టని విషయం. ప్రభుత్వ వైఖరి వెనక ఎవరి ప్రయోజనలు దాగిఉన్నాయన్న ప్రశ్న సామాన్యుడిని వేధిస్తోంది. ఆర్టీసీ సమ్మెను మొదట చాలా తేలికగా తీసుకున్న ప్రభుత్వానికి పోను పోను ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ వైపు పట్టు వదలని విక్రమార్కుల్లా ఆర్‌టీసీ కార్మికులు...ఇంకోవైపు హైకోర్టు అక్షింతలు ..మరో వైపు కార్మికుల ఆత్మహత్యలు. బహుశా ప్రభుత్వ పెద్దలు ఇదంతా ఊహించి ఉండరు. ఇప్పుడు దిగి రావటానికి అహం అడ్డొస్తున్నట్టు కనిపిస్తోంది. చర్చలకు పిలవమని పదే పదే కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు ఎలా దిగివస్తుంది?

ఇదిలావుంటే, గురవారం ఆర్టీసీ సమ్మె, ప్రభుత్వ తీరుపై మరోసారి హైకోర్టు చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ప్రభుత్వానికి అధికారం ఉన్నట్లే కోర్టులకు కూడా అధికారాలు ఉంటాయనే సంగతి మర్చిపోవద్దని ప్రభుత్వానికి గుర్తు చేయటం తీవ్రతకు అద్దం పడుతోంది. ఈనెల 11లోపు కార్మికులతో చర్చలు జరపని పక్షంలో తామే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించటం త్వరలో ఏం జరగబోతోందో చూచాయాగా అర్థమవుతోంది. అంతేకాదు, తెలంగాణ ఆర్టీసీ ఇప్పటికీ ఏపీ ఆర్టీసీలో భాగమేనని ...తదుపరి విచారణ వరకు ఎలాంటి రూట్లను ప్రైవేట్ పరం చేయడం కుదరదని చెప్పటం ఆర్టీసీ కార్మికులకు తాత్కాలిక ఉపశమనంగా చెప్పుకోవచ్చు. అయితే దీంతో సంబరపడిపోతే సరిపోదు. ఇది పూర్తిగా సంకేతిక అంశం. తెలంగాణ ప్రభుత్వం సంకేతిక అంశాన్ని పరిష్కరించటానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు. అయితే ఈ విషయంలో కేంద్రాన్ని ఇప్పటికిప్పుడు ఒప్పించగలుగుతుందా అన్నది ప్రశ్న. అది తేలే వరకు తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తున్న ఆర్టీసీ ప్రైవేటీకరణ సాధ్యం కాకపోవచ్చు.

మరోవైపు, ఆర్టీసీ అంశాన్ని ఎలాగైనా కేంద్ర కోర్టులోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో తెలియదు. ఈ అంశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుంటారని వస్తున్న వార్తలు వస్తున్నాయి. టీఎస్ ఆర్టీసీ ఏర్పాటును తాము చట్టపరంగా గుర్తించడం లేదని కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. ఏపీఎస్ ఆర్టీసీ విభజన ఇంకా పూర్తి కానందున టీఎస్ ఆర్టీసీ ఏర్పాటును తాము గుర్తించలేదని అంటోంది. అదే నిజమైతే కేంద్రం అనుమతి లేకుండా తెలంగాణ ప్రభుత్వం ఒక్క రూట్‌ను కూడా ప్రైవేట్ పరం చేయలేదు. అదే జరిగితే ఎప్పుడెప్పుడు ఆర్టీసీని ప్రైవేట్ పరంగఱ చేద్దామా అని ఉవ్విళ్లూరుతున్న సీఎం కేసీఆర్‌కు ఇది నిజంగా రెడ్ సిగ్నలే. !!

మున్సిపల్ ఎన్నికలకు ముందస్తు వ్యూహాలు

రంగంలోకి దిగిన మాజీ ఎంపి కవిత
పురపాలికల్లో పాగా వేసేలా చర్చలు

నిజామాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలకు అతి త్వరలోనే నోటిఫికేషన్ రానుండడంతో అధికార పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. మాజీ ఎంపీ కవిత ఆధ్వర్యంలో పలు దఫాలు చర్చలు జరిపారు. మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ నేతలు గత కొన్ని రోజులుగా మాజీ ఎంపీ, టీఆర్ఎస్ సీనియర్ నేత కవిత ఆధ్వర్యంలో పలు దఫాలు హైదరాబాద్‌లో చర్చించారు. పలు దఫాలు సమావేశాలను నిర్వహిం చారు. మాజీ ఎంపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రితోపాటు ఎమ్మెల్యేలు, కీలక నేతలు పాల్గొని మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే విధంగా చర్చలు జరిపారు. సీ ఎం కేసీఆర్ ఆదేశించిన విధంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సి పాలిటీలపైనా వీరు చర్చించారు. రిజర్వేషన్ లు ప్రకటించి నోటిఫికేషన్ వచ్చిన వెంటనే రంగంలోకి దిగే విధంగా ఈ చర్చలను జరి పారు. మాజీ ఎంపీ కవిత ఆధ్వర్యంలో జరిగి న పలు సమావేశాల్లో మొత్తం మున్సిపా లిటీల్లో మళ్లీ టీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవే సే విధంగా ప్రయత్నాలను మొదలుపెట్టారు. అన్ని ఎన్నికల్లో టీఆర్ఎస్ అత్యధిక సీట్లను కై వశం చేసుకున్నందున మొత్తం మున్సిపాలిటీలను గెలిపించుకునే విధంగా చూడాలని సీఎం ఆదేశించడంతో వీరు తీవ్ర ప్రయత్నా లు కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ నియోజవర్గం పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో మళ్లీ పాగా వేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. రిజర్వే షన్‌లను ప్రకటించిన వెంటనే అభ్యర్థులను బరిలోకి దించేందుకు సన్నద్ధాలు చేస్తున్నారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో మెజారిటీ వార్డులు కైవశం చేసుకునే విధంగా నేతలతో చర్చిస్తున్నారు. కొత్తవారికి సైతం ఈ దఫా అ వకాశం ఇచ్చేందుకు పరిశీలిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా మెజారిటీ స్థానాలను గెలుచుకునే విధంగా వ్యూహాలను రచిస్తున్నారు. నోటిఫికేషన్ రాగానే బరిలోకి దిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సన్నాహకంగా ముందస్తుగా నేతలు చర్చించి, మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీని సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అన్ని మున్సి పాలిటీల పరిధిలో టీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు లేరు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో అర్బన్, రూరల్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరి ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరుగను న్నాయి. మెజారిటీ 50 వార్డులు అర్బన్ ఎమ్మెల్యే పరిధిలో ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన పది వార్డులు రూరల్‌తో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పరిధిలో ఉన్నాయి. బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల పరిధిలోనే ఉన్నాయి. భీమ్ గల్ నుంచి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేల పరిధిలో ఉండగా, జగిత్యాల కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పరిధిలో ఉన్నాయి. మున్సిపాలిటీల గెలుపు బాధ్యతను కూడా ఎమ్మెల్యేలకే అప్పగించనున్నారు. వీరి ఆధ్వర్యంలో మాజీ ఎంపీ కవిత పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో అధికార పార్టీకి చెందిన ఎక్కువమంది నేతలు హైద రాబాద్‌కు తరలివెళుతూ, మాజీ ఎంపీ కవిత తోపాటు మంత్రి

ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌ గుప్త, షకీల్ అమీర్, విద్యాసాగర్‌రావు, డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి వస్తున్నారు. వీరి తోపాటు మరికొంత మంది నేతలు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి ము న్సిపల్ ఎన్నికల్లో తమకు అవకాశం కల్పించా లని కోరుతున్నారు. ఎన్నికలకు ఏ క్షణమైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో ముందస్తుగా అధికార పార్టీ నేతలు ప్రయ త్నాలు మొదలుపెట్టారు. వీరితోపాటు మొన్నటి వరకు పదవులు అనుభవించిన నేతలు కూడా ప్రయత్నాల్లో కొనసాగించడంలో ముందు వరుసలో ఉన్నారు.

కొత్త రేషన్ కార్డులు జారీకి ముహూర్తం ఎప్పుడో

వివరాలు సేకరించినా అందని కార్డులు
కార్డుల జారీపై ప్రభుత్వం నుంచి కానరాని స్పష్టత

మేడ్చల్,నవంబర్9(ఆర్ఎన్ఎ): కొత్త రేషన్‌కార్డుల కోసం లబ్దిదారులు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఆహార భద్రతా కార్డులను మహిళల పేరుపై జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కార్డు కుటుంబ సభ్యుల వివరాలతో సహా చిప్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అయితే కార్డుల పంపిణీపై సర్కారు ఐదు సంవత్సరాలుగా వాయిదా వేస్తుంది. ఈ ప్రభుత్వంలోనైనా కొత్త కార్డులు అందేనా అని లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం కార్డుల పంపిణీపై ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు జారీచేయలేదు. కొత్త కార్డులు ఎప్పుడు అందుతాయన్నది ప్రశ్నార్థకంగానే మారింది. ఉమ్మడి రాష్ట్రంలో జారీచేసిన తెల్లరేషన్ కార్డులను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో తెలంగాణ సర్కార్ ఆహార భద్రతా కార్డులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం జారీచేసిన తెల్ల రేషన్‌కార్డులు బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడేవి. అయితే ప్రస్తుత సర్కారు ఈ కార్డులు కేవలం నిత్యావసర సరుకులకు మాత్రమే పరిమితి చేసింది. జిల్లాలో మొత్తం 636 రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, కిరోసిన్, చెక్కర, పట్టణాల్లో గోధుమలు పంపిణీ చేస్తున్నారు. ఆహార భద్రతా పథకం కింద కుటుంబంలో మూడేళ్లు దాటిన వారందరికీ ఆరు కిలల చొప్పున రూపాయికి కిలో బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అన్నపూర్ణ కార్డు లబ్దిదారులకు ఉచితంగానే బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. లబ్దిదారులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నప్పటికీ, కార్డులు మాత్రం జారీ చేయడం లేదు. లబ్దిదారుల వేలిముద్రల ఆధారంగా రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నారు. గ్రామీణప్రాంతాల్లో తెల్లకాగితాలపై సరుకులు తీసుకుంటున్నట్టుగా రాసి ఇస్తున్నారు. ఆహార భద్రతా కార్డుల జారీలో జాప్యం జరుగుతోంది. కొత్త కార్డులను పంపిణీ చేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. కార్డుల మంజూరు కోసం గతంలో రేషన్‌డీలర్ల వారీగా పౌరసరఫరా శాఖ అధికారులు లబ్దిదారుల వివరాలను సేకరించారు. కుటుంబంలోని సభ్యులందరి ఫొటోలతో పాటు సభ్యుల వివరాలను తీసుకున్నారు. కార్డుల జారీకి పొందుపర్చాల్సిన ప్రొఫార్మా ఫారాలను రేషన్ డీలర్లకు అందజేశారు. ప్రొఫార్మాలో ప్రధానంగా కుటుంబ సభ్యుల పేర్లు తప్పుగా ఉన్న పక్షంలో చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం కల్పించింది. కొత్త కార్డుల కోసం లబ్దిదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. కొత్తగా పెళ్లయిన కుటుంబాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వలస వచ్చిన కుటుంబాలు దరఖాస్తు చేస

అమితాబ్‌కు అనారోగ్యం

ఫిలిం ఫెస్టివల్‌కి దూరం

కోల్‌కత్తా,నవంబర్9(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ బిగ్ బీ అమితాబ్ బచ్చన్ అనారోగ్యానికి గురయ్యారు. ఈ కారణంగానే ఆయన నిన్న (శుక్రవారం) సాయంత్రం జరిగిన 25వ కోల్‌కత్తా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్లో పాల్గొనలేదు.వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బాలీవుడ్ బాద్ షా షారూఖ్‌ఖాన్ ఫెస్టివల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అయితే ప్రతి సంవత్సరం ఈ వేడుకకి హాజరయ్యే అమితాబ్ బచ్చన్ గత రాత్రి నుండి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారనా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మీడియాకు తెలిపారు. వైద్యులు ఆయనని పూర్తి విశ్రాంతి తీసుకోమన్న కారణంగా అమితాబ్ కార్యక్రమానికి అటెండ్ కాలేకపోయారు. అమితాబ్ బచ్చన్ లేకుండా ఈ ఫిలిం ఫెస్టివల్ అసంపూర్ణం అని మమతా పేర్కొన్నారు.

అమితాబ్ బచ్చన్ కాలేయ సంబంధింత వ్యాధితో అక్టోబర్ 15 మంగళవారం తెల్లవారు జామున 3గం.లకి నానావతి ఆసుపత్రిలో అడ్మిట్ అయిన సంగతి తెలిసిందే. నాలుగు రోజులుగా అమితాబ్ ఆసుపత్రిలోనే ఉన్నారనే సరికి అభిమానులు ఎంతగానో ఆందోళన చెందారు. ఆయనకి ఏమైందో తెలుసుకునే ప్రయత్నాలు చేశారు. రెగ్యులర్ చెకప్ కోసమే అమితాబ్ వచ్చారని వైద్యులు చెప్పడంతో అభిమానులలో ఆందోళన తొలగిపోయింది. శుక్రవారం రాత్రి డిశ్చార్జ్ అయిన అమితాబ్‌ని ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, భార్య జయాబచ్చన్‌లు కారులో ఇంటికి తీసుకెళ్ళారు. తన కాలేయం 75 శాతం దెబ్బతిందని ఇటీవల అమితాబ్ బచ్చన్ ఓ కార్యక్రమంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. తాను టీబీ, హెపటైటిస్ బి వ్యాధుల నుంచి కోలుకున్నానని కూడా చెప్పారు.

తీర్పులో కీలకంగా మారిన పురావస్తు శాఖ నివేదిక

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): దశాబ్దాలుగా కొనసాగుతున్న అయోధ్య కేసు వివాదానికి సుప్రీంకోర్టు ముగింపు పలికింది. అయోధ్యలో వివాదాస్పదమైన రామజన్మ భూమి – బాబ్రీ మసీదు కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇవాళ తుదితీర్పు వెల్లడించింది. భారత పురావస్తు శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగానే సుప్రీంకోర్టు తీర్పులో కీలకమైంది.సీజేఐ రంజన్ గోగోయ్ తీర్పు సారాంశాన్ని వెల్లడిస్తూ.. అయోధ్యలో ఖాళీ స్థలంలో బాబ్రీ మసీదు నిర్మించలేదని పురావస్తు విభాగం నివేదికలు చెబుతున్నాయి. వివాదాస్పద స్థలంలోని నిర్మాణాలకు ఇస్లామ్ మూలాలు లేవు. శ్రీరాముడి జన్మస్థానం అయోధ్య అన్న హిందువుల విశ్వాసం వివాదరహితం. రామజన్మ భూమి న్యాయపరమైన వ్యక్తి కాకపోవచ్చు కానీ ఇక్కడ రాముడే కక్షిదారుడు. స్థలం తమ ఆధీనంలో ఉందని సున్నీ వక్ఫ్ బోర్డు నిరూపించలేకపోయింది. 1857కు ముందు నుంచే ఈ ప్రాంతాన్ని హిందువుల సందర్శించారనేందుకు ఆధారాలున్నాయి. అయితే రామ మందిరాన్ని కూల్చి మసీదును కట్టారు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. 12-16 శతాబ్దాల మధ్య అక్కడే ముందో చెప్పడానికి పురావస్తు ఆధారాలు కూడా లేవు అని రంజన్ గోగోయ్ చెప్పారు.

భవిష్యత్‌లో తెలంగాణ పోలీసులకు కష్టాలు తప్పవు: జగ్గా రెడ్డి

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): సీనియర్ కాంగ్రెస్ నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మరోమారు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత కొంతకాలంగా తనదైన శైలిలో ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీపై సంచలన కామెంట్లు చేస్తూ...వార్తల్లో నిలుస్తున్న ఆయన...తాజాగా తెలంగాణ పోలీసులపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ సమ్మెపై స్పందించిన జగ్గారెడ్డి ఈ ఎపిసోడ్‌లోకి తెలంగాణ పోలీసులను లాగారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో చిట్ ఛాట్ చేస్తూ...ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగ్గారెడ్డి మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికులకు హైకోర్టు న్యాయం చేస్తుందని నమ్ముతున్నామని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ జేఏసీ తలపెట్టిన చలో ట్యాంక్ బండ్ కు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తోందని ప్రకటించారు.

పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులన్నీ ఆర్టీసీ జేఏసీకి మద్దతుగా చలో ట్యాంక్ బండ్ నిరసనలో పాల్గొంటారని జగ్గారెడ్డి వివరించారు.'తెలంగాణ ఉద్యమం సమయంలో నిర్వహించిన మిలియన్ మార్చ్ రీతిలో ...చలో ట్యాంక్ బండ్ ప్రోగ్రామ్‌ను సక్సెస్ చేస్తాం' అని జగ్గారెడ్డి ప్రకటించారు.

ప్రజలు సహకరించి ఆర్టీసీ కార్మికులకు అండగా ఉండాలని ఆయన కోరారు. ప్రస్తుతం జరుగుతున్న ముందస్తు అరెస్టులపై జగ్గారెడ్డి ఘాటుగా స్పందించారు.

'ఈ అరెస్టులు...తెలంగాణ పోలీసులు చేస్తున్నారా ..మహారాష్ట్ర వాహనాలలో వచ్చి మహారాష్ట్ర పోలీసులు చేస్తున్నారా.?' అని ఆయన నిలదీశారు. తెలంగాణాలో ప్రజలు ఉండాలా ..ఉండొద్దా?' అని నిలదీశారు. తెలంగాణాలో బ్లాక్ మెయిల్ రాజకీయాలు నడుస్తున్నాయని జగ్గారెడ్డి ఆరోపించారు.

ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించే వారిని తెలంగాణ పోలీసులు భయకంపితులను చేస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. 'ఏకపక్షంగా అరెస్ట్ లు చేస్తున్న పోలీసులారా జాగ్రత్త....ఎల్లకాలం కేసీఆర్ అధికారంలో ఉండరని పోలీసులు గుర్తుంచుకోవాలి. భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీ ఎవరు అధికారంలోకి వచ్చినా....ఇప్పుడు ఇబ్బందులు పెడుతున్న పోలీసులకు కష్టాలు తప్పవు.'అని హెచ్చరించారు.

పసుపుబోర్డును త్వరితగతిన ఏర్పాటు చేయండి..

-కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన టీఆర్ఎస్ ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షుడు

మెల్‌బోర్న్,నవంబర్ 9: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డిని ఆస్ట్రేలియా విభాగం టీఆర్ఎస్ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన నిజామాబాద్‌లో పసుపుబోర్డును త్వరగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

టెర్రరిజంపై మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ సదస్సులో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహి ంచడానికి వచ్చిన మంత్రిని సదస్సు అనంతరం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నిజా మాబాద్ పసుపుబోర్డు అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం, విభజన చట్టంలో పొందుపర్చిన హామీలను నెరవేర్చేదిశగా ఓ తెలంగాణ బిడ్డగా పోరాడాలని వారు విన్నవిం చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిగా ఎన్నికైన కిషన్‌రెడ్డికి వారు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాగేందర్ రెడ్డితో పాటు సాయిరాం ఉప్పు, సాయి యాదవ్, రామకృష్ణ, అరుణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ అనుకూలం

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ) : వివాదాస్పద అయోధ్య స్థలంపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి తాము అనుకూలమని ఆ పార్టీ అధికార ప్రతినిధి రన్‌దీప్ సుర్జేవాలా అన్నారు. సుప్రీం తీర్పు ఆలయ నిర్మాణానికి ద్వారాలు తెరవడమే కాదు బీజేపీ, ఇతర పక్షాలకు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకునేందుకు ద్వారాలు మూసుకున్నాయని ఆయన పేర్కొన్నారు.

భర్త చిత్రహింసలతో భార్య బలవన్మరణం

నిర్మల్,నవంబర్9(ఆర్ఎన్ఎ): భర్త చిత్రహింసలు తాళలేక భార్య పురుగుల మందుతాగి మృతిచెందిన సంఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ జయరాం నాయక్, ఎస్సై భవానిసేన్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతాండ గ్రామానికి చెందిన లక్ష్మి (40) భర్త బుక్య బలిరాం సోదరుడు గతంలో మృతిచెందాడు. అతడి భార్యతో బలిరాం వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఈ విషయంపై భార్యతో తరుచుగా గొడవలు జరిగేవి. గ్రామస్తులు సైతం పలుమార్లు హెచ్చరించారు. అయినా తీరు మార్చుకోకపోవడంతో పాటు భార్యను తరుచుగా వేధించేవాడు. శుక్రవారం ఉదయం పంటచేనుకు వెళ్లిన లక్ష్మిని అక్కడికి వెళ్లి తీవ్రంగా కొట్టాడు. దీంతో పంట చేనులోని పురుగుల మందు తాగి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు వెంకటేశ్, కూతుల్లు చంద్రకళ, స్వప్న ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అది కేంద్రం ఘనత కాదన్న ఉద్ధవ్ ఠాక్రే

ముంబై,నవంబర్9(ఆర్ఎన్ఎ) : అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టు వెల్లడించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయోధ్య తీర్పును మోడీ సర్కార్ తన ఘనతగా చాటు కోలేదని ఉద్ధవ్ అన్నారు. అయోధ్యలో వివాదాస్పద స్థలాన్ని మందిర నిర్మాణానికి ఏర్పాటు చేసే ట్రస్ట్‌కు అప్పగించాలని, మసీదు నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి చట్టం చేయాలని తాము ప్రభుత్వాన్ని కోరితే అందుకు నిరాకరించిందని, సుప్రీం తాజా తీర్పును ప్రభుత్వం ఇప్పుడు తమ ఘనతగా చెప్పుకోరాదని ఠాక్రే ఆక్షేపించారు. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై బీజేపీ, శివసేనల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. సీఎం పదవిని చెరి రెండున్నరేళ్లు పంచుకోవాలన్న సేన ప్రతిపాదనను బీజేపీ వ్యతిరేకిస్తోంది.

మహా సందిగ్ధత విషయంలో.. తాను జోక్యం చేసుకోను

– కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ముంబయి, నవంబర్9(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న సందిగ్ధత విషయంలో తాను జోక్యం చేసుకోబోనని భాజపా నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. తాను ఆ దిశగా ఎలాంటి చర్చలు జరపడం లేదని..ఏ నేతలతో సమావేశం కావడం లేదని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఓ కార్యక్రమానికి హాజరవడంలో భాగంగానే ముంబయికి వచ్చానన్నారు. శివసేన చెబుతున్న 50-50 ఒప్పందమేదీ రెండు పార్టీల మధ్య జరగలేదని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుపై భాజపా – శివసేన మధ్య ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో గడ్కరీ రాక ముంబయి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార విభజనలో ఇరు పార్టీల మధ్య నెలకొన్న పీటముడి విప్పడానికే ఆయన రంగప్రవేశం చేశారంటూ ఊహాగానాలు వినిపించాయి. దీనిపై గడ్కరీ ఈ విధంగా స్పందించారు.

హైదరాబాద్‌లో 170 మంది అరెస్ట్

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ):: చలో ట్యాంక్‌బండ్ నేపథ్యంలో170 మందిని అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్టీసీ జేఏసీ నేతలు, రాజకీయ పార్టీల నేతలను ముందస్తు అరెస్ట్‌లు చేశామన్నారు. ట్యాంక్‌బండ్‌పై ప్రశాంత వాతావరణం ఉందని సీపీ తెలిపారు. ఇదిలా ఉంటే.. అయోధ్యపై సుప్రీంకోర్టు నేపథ్యంలోనూ నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అంజనీకుమార్ తెలిపారు. అంతేకాకుండా సున్నిత ప్రదేశాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. కాగా.. తెలంగాణ ఆర్టీసీ కార్మికులు, కార్మికనేతలు పిలుపునిచ్చిన 'చలో ట్యాంక్‌బండ్' కార్యక్రమానికి పోలీసుల అనుమతి లభించలేదు. దీంతో పోలీసులు శుక్రవారం నుంచే కార్మికులు, కార్మిక నేతలను ఎక్కడికక్కడే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు.

కేంద్రం రాష్ట్రం దొందూ దొందే: రాజనర్సింహ్మ

మెదక్,నవంబర్9(ఆర్ఎన్ఎ): జిల్లా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, టిఆర్ఎస్, బీజేపీలు దొందూ దొందే నంటూ మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహ విమర్శించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనరసింహ మాట్లాడుతూ కార్పొరేట్ పెట్టుబడుదారులకు మోదీ ప్రభుత్వం కొమ్ము కాస్తోందని విమర్శించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలను ఇస్తానని చెప్పి.. ఉన్న ఉద్యోగాలను ఉడగొడుతున్నారని ఆరోపించారు. నోట్ల రద్దు, జీఎస్టీలతో పేద, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నవంబర్ 8 నోట్లరద్దు బ్లాక్ డేగా అభివర్ణిస్తున్నామన్నారు. జీఎస్టీ అంటే గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని రాజనరసింహ ఎద్దేవా చేశారు.

రూ.2000 నోటునీ రద్దు చేయాలి

– వ్యవస్థలో నగదు చెలామణి ఇంకా భారీగానే ఉంది
– ఈ నోట్లనుకూడా దాచి ఉంచుతున్నట్లు ఆధారాలున్నాయి
– ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి ఎస్.సి.గార్గ్

న్యూఢిల్లీ, నవంబర్8(ఆర్ఎన్ఎ) : రూ. 2వేల నోటును రద్దు చేయాలని, రోజువారీ లావాదేవీలకు ప్రజలకు ఇవి అందుబాటులో ఉండటం లేదని ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి ఎస్సీ గార్గ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

మోదీ ప్రభుత్వం చేసిన నోట్ల రద్దుకు నేటికి మూడేళ్లు. నల్లధనం వెలికితీత, నకిలీ కరెన్సీని అడ్డుకోవడమే లక్ష్యంగా రూ.500, రూ.1000ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గార్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అప్పటి పెద్ద నోట్ల స్థానంలో తెచ్చిన రూ.2000 నోటును కూడా ఇప్పుడు రద్దు చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి ఎస్.సి.గార్గ్ అభిప్రాయపడ్డారు. వ్యవస్థలో నగదు చెలామణి ఇంకా భారీగానే ఉందని, రూ.2000నోట్లను కూడా దాచి ఉంచుతున్నట్లు ఆధారాలున్నాయన్నారు.. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, కానీ భారత్‌లో మాత్రం అది చాలా నెమ్మదిగా సాగుతోందని గార్గ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్ల విలువలో మూడో వంతు రూ.2000 నోట్లే ఉన్నాయని తెలిపారు. వీటిలో చాలా వరకు చెలామణిలోకి రావడం లేదన్నారు. రోజువారీ లావాదేవీలకు ప్రజలకు ఇవి అందుబాటులో ఉండడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకోవడం లేదా రద్దు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న రూ.2000నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యేలా చర్యలు తీసుకుంటే సరిపోతుందని గార్గ్ తెలిపారు. ఇదే మేలైన మార్గమని.. దీనివల్ల పెద్దగా ఇబ్బందులు కూడా తలెత్తవన్నారు. అయితే వాటి స్థానంలో నగదును తిరిగి ఇవ్వొద్దన్నది షరతు పెట్టడం ద్వారా చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లన్నీ వెనక్కి వస్తాయన్నారు.

ఆర్థిక లావాదేవీలకు అనేక డిజిటల్ సాధనాలు అందుబాటులోకి వచ్చాయని గార్గ్ గుర్తుచేశారు. అయినా భారత్‌లో మాత్రం ఇంకా 85శాతం నగదు ఆధారిత చెల్లింపులే జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్ని డిజిటల్ చెల్లింపుల దిశగా మార్చే చర్యల్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అందుకోసం నగదు చెల్లింపులపై పన్నులు, ఛార్జీలు విధించాలన్నారు. అదే సమయంలో డిజిటల్ చెల్లింపుల్ని మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఆ దేశంలో 87శాతం లావాదేవీలు డిజిటల్ రూపంలోనే జరుగుతున్నాయని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ సైతం బ్యాంకింగేతర డిజిటల్ చెల్లింపు సాధనాల్ని వ్యవస్థలోకి తీసుకొచ్చే చర్యలు తీసుకోవాలన్నారు.

సంక్షేమ పాలనలో

తెలంగాణ దేశానికే ఆదర్శం

– పీఎంజీఎస్‌వైలో రోడ్ల విషయంపై రాష్ట్రానికి ప్రాధాన్యతివ్వాలి
– మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హైదరాబాద్, నవంబర్9(ఆర్ఎన్ఎ) : సంక్షేమ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పంచాయితీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు అన్నారు. పీఎంజీఎస్‌వై ఈమార్గ్‌లపై కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నగరంలోని హరితా ప్లాజాలో శుక్రవారం ప్రాంతీయ శిక్షణ కార్యక్రమ ముగింపు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి గ్రామసడక్‌యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద మంజూరు చేసే రోడ్ల విషయంలో తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎర్రబెల్లి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని అవనరాలకు గ్రామీణ ప్రాంతాలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకుని కొత్తగా రోడ్లను మంజూరు చేయాలని అన్నారు. పీఎంజీఎస్‌వై మూడో దశలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 2019-20 సంవత్సరంలో 2,427.50 కి..మీ. మంజూరు చేసిందని దీనిని మరింతగా పెంచి 4వేల కి.మీ. తగ్గకుండా చూడాలని అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో 2007లో చేసిన తప్పిదాల వల్ల తెలంగాణలోని 534 గ్రామాలకు తారు రోడ్డు మంజూరులో సాంకేతిక ఇబ్బందులు వచ్చాయని అన్నారు. దీన్ని సరిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రోడ్ల అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ పాత్రను కేంద్ర ప్రభుత్వ అధికారులకు మంత్రి ఎర్రబెల్లి వివరించారు. ఆసరాపథకం పేరుతో సామాజిక భద్రత పథకానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనంత ఎక్కువ మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన మంచినీటిని సరఫరా చేసే మిషన్‌భగీరథ పథకాన్ని విజయవంతంగా పూర్తిచేస్తున్నామని అన్నారు. రోడ్ల నిర్మాణం విషయంలో తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రత్యేక అవసరాలను దృష్టిలోపెట్టుకుని రాష్ట్రంలోని 90శాతం గ్రామీణ నియోజక వర్గాల పరిధిలో అదనంగా 20 కి.మీ. చొప్పున 4వేల కి.మీ.కు తగ్గకుండా మంజూరు చేయాలని కోరుతున్నట్టు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. అక్టోబరులో ఇదే విషయంలో సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి మోదీని కలిశారని అన్నారు. పీఎంజీఎస్‌వై పథకంలో రోడ్లు నిర్మించేందుకు అర్హత ఉన్న 676 ఆవాసాలకు తారు రోడ్లు ఉన్నట్టుగా 2007లో అప్పటి ప్రభుత్వం పొరపాటుగా రికార్డు చేసిందని, దీని వల్ల ఈ ఆవాసాలకు తారురోడ్డు మంజూరు కాలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన పొరపాటు జరిగిన పొరపాటు కారణంగా తారు రోడ్డు ఉన్నట్లుగా సవోదదైన వాటిలో 534 ఆవాసాలకు తారురోడ్లు వేయాల్సి వుంది. పీఎంజీఎస్‌వై మూడో దశలో కొత్తగా మంజూరు చేసే సమయంలో పరిశీలించి 534 ఆవాసాలకు రోడ్లు వేసేందుకు సహకరించాలని కోరుతున్నానని అన్నారు.

నుమాయిష్‌కు కట్టుదిట్టమైన భద్రత

హైదరాబాద్,నవంబర్ 9: నుమాయిష్‌కు వచ్చే సందర్శకులు, స్టాళ్ల యజమానుల భద్రతకు ఈ ఏడాది అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. గతేడాది నుమాయిష్‌లో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పర్యటించిన మంత్రి, అక్కడ చేపట్టిన పలు పనులను పరిశీలించి, తదనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయా వివరాలను మీడియాకు వెల్లడించారు. నుమాయిష్.. నగరవాసులకు చిర, సుపరిచితమైన ఎగ్జిబిషన్.. కుటుంబ సపరివార సమేతంగా వెళ్లి ఇంటిల్లిపాదికి కావాల్సిన వస్తువులను షాపింగ్ చేసుకునే ఏకైక చోటు. నగరంలో అతిపెద్దదైన పారిశ్రామిక ప్రదర్శనగా ప్రసిద్ధిగించిన ను మాయిష్ నిర్వహణకు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నదన్నారు.

2020 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజులపాటు నుమాయిష్ కొనసాగుతుందని మంత్రి వివరించారు. పోలీసులు, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులు, నిపుణుల సూచనల మేరకు మైదానంలో పలు ఏర్పాట్లు చేస్తున్నామని, చేపట్టిన పనులన్నీ 10 రోజుల్లోగా పూర్తవుతాయని ఈటల రాజేందర్ తెలిపారు. ఎ

గ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎన్. సురేందర్, కార్యదర్శి డా. వి. ప్రభాశంకర్, సంయుక్త కార్యదర్శి డి. హనుమంతరావు, కోశాధికారి ఎన్. వినయ్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2850 మీటర్ల భూగర్భ అగ్నిమాపక లైన్లు..

అగ్నిప్రమాదాలు, వివత్తులు జరిగితే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎగ్జిబిషన్ మైదానంలో 2850 మీటర్ల పొడవులో అగ్నిమాపక నీటి లైన్లు వేస్తున్నారు.

ఒక్క దీని కోసమే రూ. 2.1 కోట్లను ఖర్చు చేస్తున్నారు. 1800 వీటర్ల పొడవులో 150 ఎంఎం, 600 మీటర్ల పొడవులో 100 ఎంఎం, 450 మీటర్లకు 80 ఎంఎం పైపులైన్లు వేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరా కోసం గాంధీ సెంటినరీ హాల్, ఈఫిల్‌టవర్ సమీపాల్లో 1.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు భూగర్భ సంప్‌లను నిర్మిస్తున్నారు.

ఈ రెండు సంప్‌ల వద్ద నిమిషానికి 2800 లీటర్ల నీటిని తోడే సామర్థ్యం గల మూడు పంపుసెట్లను అమర్చుతున్నారు. విద్యుత్‌తో, బ్యాటరీ, డీజిల్‌తో నడిచే ఈ మూడు పంపుసెట్లతో మైదానం యావత్తు 2కిలోమీటర్ల మేర గల అగ్నిమాపక లైన్లకు నీటిని సరఫరా చేయనున్నారు. ఈ పైపులైన్ల మధ్యలో నీటిని సరఫరా చేసేందుకు ప్రతీ 200 మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 80 ఫైర్ హైడ్రాంట్స్ (నీటిని విడుదల చేసే)ను అమర్చుతున్నారు.

ప్రతీ హైడ్రాంట్ నుంచి 30 మీటర్ల మేర నీటిని సరఫరా చేసేందుకు రబ్బరుపైపును అందుబాటులో ఉంచుతున్నారు.

473 మీటర్ల భూగర్భ విద్యుత్‌లైన్లు..

ఎగ్జిబిషన్ మైదానంలో లూజువైర్లు, లూజు కనెక్షన్లతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశముండటంతో ఓవర్‌హెడ్‌లైన్లంటిని మార్చుతున్నారు. అంతర్గతంగా విద్యుత్ సరఫరా చేసే ఓవర్‌హెడ్ విద్యుత్‌లైన్లను పూర్తిగా భూగర్భలైన్లుగా మార్చుతున్నారు. ఒక్కవైరు కూడా బయటికి కనిపించకుండా, భూగర్భ కేబుళ్లు వేస్తున్నా రు.

ఇందుకోసం రూ. 82.65 లక్షలను వెచ్చిస్తున్నారు. గతేడాది 880మీటర్లు (80శాతం) భూగర్భ విద్యుత్‌లైన్లు వేయగా, తాజాగా మిగిలిపోయిన 473 మీటర్ల నిడివి గల ఓవర్‌హెడ్‌లైన్లను భూగర్భమార్గంలో వేస్తున్నారు. విద్యుత్‌శాఖ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ (సీఈఐజీ) సూచనల మేరకు కేబుల్స్‌ను భూగర్భంలోకి మా ర్చి విద్యుత్ ప్రమాదాలకు అస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇక విద్యుత్ ప్రమాదాలు జరిగినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా వెంటనే ట్రిప్ అయ్యేందుకు వీలుగా ఎంసీ బాక్స్‌లను అమర్చుతున్నారు.

గతేడాది 160 ఏఎంపీఎస్ సామర్థ్యం గల 22 డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌లను ఏర్పాటు చేయగా, తాజాగా ట్రిప్ అయ్యేందుకు వీలుగా ఎంసీబీలను అమర్చుతున్నారు.

మరికొన్ని ఏర్పాట్లు..

అగ్నిమాపక శకటాలు తిరగడానికి వీలుగా విస్తారంగా అంతర్గత రోడ్లు ఉండేలా చర్యలు. అవసరమైతే స్టాళ్ల సంఖ్యను తగ్గించడం.. కుదించడం.

స్టాళ్ల నిర్వాహకులు గ్యాస్‌స్టాప్‌లతో ఆహారాన్ని తయారు చేసుకోవడం, వంట చేసుకోవడం నిషేధం.

బీడీలు, సిగరెట్లు, అగ్గిపెట్టెలతో మైదానంలోకి ప్రవేశంపై పూర్తి నిషేధం.

ప్రతి స్టాల్‌

ఏడు దశాబ్దాల వివాదంలో..

అనూహ్య మలుపులు..

- ఆద్యంతం ఉత్కంఠ భరితమే
- బ్రిటీష్ కాలం నేటి వరకు యుద్ధవాతావరణమే
- క్లిష్టమైన సమస్యను పరిష్కరిస్తూ సుప్రీం సంచలన తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్9(ఆర్ఎన్ఎ) : అయోధ్యలోని రామ జన్మభూమి-బాబ్రీ మసీదు స్థల వివాదం బ్రిటిష్ కాలం నుంచే కొనసాగుతోంది. స్వాతంత్రానికి పూర్వమే తెరపైకి వచ్చినా 1959 తర్వాత తీవ్రతరమైంది. ఈ ఏడు దశాబ్దాల్లో అనేక మలుపులు తిరిగి అయోధ్య వివాదంపై అనేక వ్యాఖ్యాలు దాఖలయ్యాయి. వాటిపై ప్రతిసారీ సంచలన తీర్పులను న్యాయస్థానాలు వెలువరించడం విశేషం. తీర్పులు వచ్చిన ప్రతిసారీ సంచలనమే. న్యాయస్థానాల్లో దాఖలైన కేసుల్లో కొన్ని ప్రధానమైనవి...

1885లో ఫైజాబాద్ జిల్లా కోర్టులో వ్యాజ్యం..

తొలిసారిగా బాబ్రీ మసీదు వద్ద రామ్‌ఛబుత్ర ప్రాంతంలో రామ మందిరం నిర్మాణానికి అనుమతి కోరుతూ మహంత్ రఘువర్‌దాస్ 1885లో ఫైజాబాద్ జిల్లా కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనికి వ్యతిరేకంగా మసీదు ముతావలి సైతం మరో కేసు వేయడం ఈ రెండింటి కోర్టు కొట్టేసింది. తర్వాత ఇది అక్కడితో ఆగిపోలేదు. హిందూ, ముస్లింల మధ్య గొడవలకు దారితీసింది.

1949లో కీలక మలుపు..

ఈ నేపథ్యంలో 1949 డిసెంబరులో బాబ్రీ మసీదులో రాముడు, సీతాదేవి విగ్రహాల్ని ప్రతిష్ఠించడంతో కీలక మలుపు తిరిగింది. దీనిపై పోలీసులకు ముస్లింలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. దీంతో, ఆ ప్రదేశాన్ని ఫైజాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ సీజ్ చేయించి, తాళాలు వేయించారు. అయితే, ఆ ప్రదేశాన్ని తెరిపించాలని, పూజలకు అనుమతించాలని కోరుతూ 1950 జనవరిలో గోపాల్‌సింగ్ విశారద్, రామచంద్రదాస్ పరమహంసలు జాబాద్ కోర్టును ఆశ్రయించారు. తర్వాత ఫిబ్రవరిలో బాబ్రీ మసీదు తమ ఆస్తి అని, హిందువులు వేసిన మూడు పిటిషన్లు కొట్టివేయాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్‌బోర్డు 1961 ఫిబ్రవరిలో వ్యాజ్యం దాఖలుచేసింది. రెండు దశాబ్దాలపాటు వివాదం కోర్టులో నడవగా, 1986లో కీలక పరిణామానం చోటుచేసు కుంది. బాబ్రీ మసీదును తెరిచి, హిందువులు పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని జాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించారు. అదే ఏడాది బాబ్రీ మసీదు కార్యాచరణ కమిటీ ఏర్పాటయ్యింది. ఈ పరిణామాలతో బాబ్రీ మసీదు - రామజ న్మభూమి సంబంధిత కేసులన్నీ యూపీ హైకోర్టుకు 1989లో బదిలీ చేశారు.

బాబ్రీమసీదు కూల్చివేతతో మరింత తీవ్రం..

ఇక 1992 డిసెంబరు 6న బాబ్రీమసీదును విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కరసేవకులు కూల్చివేశారు. ఈ ఘటనపై విచారణకు జస్టిస్ లిబర్‌హాన్ కమిషన్‌ను కేంద్రం నియమించింది. కమిషన్ విచారణ ప్రారంభం కాగా, దస్త్రాలను సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఇదే సమయంలో అయోధ్యకు రథయాత్ర నిర్వహించిన బీజేపీ అగ్రనేత ఎల్‌కే ఆద్వాణీ, మురళీ మనోహర్ జోషి సహా మరో 19 మందిపై మసీదు కూల్చివేసేలా కరసేవకుల్ని రెచ్చగొట్టారంటూ అభియోగాలు నమోదుచేశారు. వివిధ అంశాలను సవాల్ చేస్తూ అలహాబాద్ హైకోర్టులో కేసుల దాఖలు. ఈ కేసుల నుంచి 2001 మేలో ఆద్వాణీ, మురళీ మనోహర్ జోషిలకు ప్రత్యేక న్యాయస్థానం ఉపశమనం కలిగించింది. అయోధ్యలోని వివాదస్పద స్థలం యాజమాన్య హక్కులపై 2002 ఏప్రిల్‌లో అలహాబాద్ హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ ప్రారంభించింది. మసీదు కింద ఆలయం ఉన్నట్లు భారత పురాతత్వ పరిశోధన సంస్థ(ఏఎస్ఐ) 2003లో బయటపెట్టిన ఆధారాలను ముస్లిం సంస్థలు వ్యతిరేకించాయి. కేంద్రం నిర్వహించిన లిబర్‌హాన్ కమిషన్ 2006 జూన్‌లో నివేదిక సమర్పించి, బాబ్రీ మసీదు కూల్చివేతకు 68 మంది బాధ్యులుగా గుర్తించింది. ఇక, 2010 సెప్టెంబరు 30న అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాదాస్పద స్థలాన్ని మూడు సమాన భాగాలుగా విభజించి రెండు భాగాలు హిందువులకు, ఒక భాగం ముస్లింలకు ఇవ్వాలని చెప్పింది. దీనిని సవాల్‌చేస్తూ ఆ తర్వాత సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలు. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై 2011 మేలో సుప్రీంకోర్టు స్టే విధించింది. కాగా, 2016 ఫిబ్రవరిలో భూ యాజమాన్య హక్కులను తేల్చడానికి అత్యవసర విచారణ జరపాలంటూ బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టును కోరారు. అయితే, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని న్యాయస్థానం వెలుపల సాధించుకోవాలని 2017 మార్చిలో త్రిసభ్య ధర్మాసనం సూచించింది. దీనికి మధ్యవర్తిత్వం వహించడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. మసీదు కూల్చివేత నిందితులపై 1992లో నమోదైన కుట్ర అభియోగాలను పునరుద్ధరించాలంటూ సీబీఐ కోర్టును 2017 ఏప్రిల్ 14న సుప్రీం ఆదేశించింది. రోజువారీ విచారణ ప్రారంభించాలని 2019 నాటికి కేసును కొలిక్కి తీసుకురావాలని స్పష్టం చేసింది. అభియోగాల నమోదు కోసం కోర్టు ఎదుట హాజరు కావాలంటూ బీజేపీ నేతలు ఎల్‌కే ఆద్వాణీ, మురళీ మనోహర్‌జోషి, ఉమాభారతి, వినయ్ కతియార్ తదితరులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అయోధ్య భూ వివాదంపై దాఖలైన అన్ని పిటిషన్లపై 2017 డిసెంబరు 5న సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. తొలుత రాజ్యాంగ ధర్మాసనం అవసరం లేదని అభిప్రాయపడిన సర్వోన్నత న్యాయస్థానం..

తాజాగా సుప్రీం సంచలన తీర్పు..

2019 జనవరి 8న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేసింది. ఇందులో జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లను సభ్యులుగా నియమించారు. కానీ, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్‌లను తప్పించి జనవరి 25 రాజ్యాంగ ధర్మాసనాన్ని పునర్వ్యవస్థీకరించింది. కొత్త ధర్మాసనంలో జస్టిస్ గొగొయితోపాటు జస్టిస్ బోబ్డే, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లకు చోటు కల్పించింది. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకునేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎఫ్.ఎం.ఐ.ఖలీఫుల్లా నేతృత్వంలో త్రిసభ్య కమిటీని మార్చిలో ఏర్పాటు చేసింది. ఈ కమిటీ జులైలో సుప్రీంకోర్టుకు తుది నివేదిక సమర్చించగా, ఆగస్టు 6 నుంచి రోజువారీ ప్రాతిపదికన విచారణ ప్రారంభించింది. అక్టోబరు 16 వరకు 40 రోజులు సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచిన ధర్మాసనం.. నవంబరు 9న తుది తీర్పు వెలువరించింది. ఏకాభిప్రాయంతో ధర్మాసనం తీర్పు వెలువరించి 134 సమస్యకు కీలక పరిష్కారం చూపింది.

రామమందిర నిర్మాణానికి.. కాంగ్రెస్ మద్దతు

- ఇక బీజేపీ తలుపులు మూసుపోతాయి
- కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా

న్యూఢిల్లీ, నవంబర్9(ఆర్ఎన్ఎ) : అయోధ్య కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును గౌరవిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా అన్నారు. సుప్రీం తీర్పు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.. రామ జన్మభూమిలో రామ మందిరం నిర్మాణానికి తాము అనుకూలమని పేర్కొన్నారు. లౌకిక విలువలు, రాజ్యాంగం అందించిన భిన్నత్వ స్ఫూర్తికి కట్టుబడి ఉండాలని, శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని పార్టీ అధినేత్రి సోనియా గాంధీ అధ్యక్షత జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు. తరతరాలుగా సమాజంలో పరస్పరం గౌరవించుకొనే మన సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత అందరి మీదా ఉందని సుర్జేవాలా అన్నారు. రామ మందిర నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందా అని ప్రశ్నించగా ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. మందిరం నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ అనుకూలమేనని వెల్లడించారు. సుప్రీం తీర్పు ఏ వ్యక్తులు, సంఘాలు, మతాలు, రాజకీయ పార్టీలకు ఘనత, అవమానం కాబోదని ఆయన పేర్కొన్నారు.

30న ఎల్ఆర్ఎస్ మేళా: లోకేష్ కుమార్

హైదరాబాద్,నవంబర్ 9(ఆర్ఎన్ఎ): ఈ నెల 30న అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహణ ఉంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, పట్టణ ప్రణాళిక విభాగంలో పెండింగ్ కేసులపై జీహెచ్ఎంసీ అధికారులతో కమిషనర్ లోకేష్ కుమార్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భేటీ అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. భూ క్రమబద్ధీకరణ పథకం దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 2016 డిసెంబర్ 31కి ముందు స్వీకరించిన దరఖాస్తులను మరోసారి పరిశీలిస్తామన్నారు. గ్రేటర్ పరిధిలో మొత్తం 85,291 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు అందాయని తెలిపిన ఆయన వీటిలో 28,935 దరఖాస్తులకు ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లు జారీచేసినట్లు చెప్పారు. 20,425 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు. మరో 25,726 మందికి కావాల్సిన పత్రాలు జతపర్చాలని సమాచారం అందజేసినట్లు పేర్కొన్నారు.

కన్నకొడుకు నిప్పంటించిన తల్లి

జైపూర్, నవంబర్9(ఆర్ఎన్ఎ) : భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ మహిళకు, ఆమె కుమారుడికి నిప్పు పెట్టింది భార్య. ఈ ఘటన రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. సందీప్ గుప్తా అనే వ్యక్తి డాక్టర్. ఈయనకు భార్య సీమా గుప్తా, తల్లి లక్ష్మణ్ గౌర్ ఉన్నారు. అయితే సందీప్ ఆస్పత్రిలో దీపా దేవి అనే మహిళ రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. ఈ క్రమంలో సందీప్, దీపా మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే దీపాకు సందీప్.. బ్యూటీ పార్లర్ పెట్టించాడు. అంతేకాకుండా ఆమెకు వసతి గృహం తన సొంతడబ్బులతో ఏర్పాటు చేయించాడు డాక్టర్. ఈ విషయం భార్య సీమా, తల్లి గౌర్‌కు తెలిసింది. దీంతో దీపా నివాసముంటున్న ఇంటికెళ్లిన సీమా, లక్ష్మణ్ గౌర్.. ఇంటి బయట నుంచి లోపలికి కొన్ని రసాయనాలు చల్లి నిప్పంటించారు. దీంతో ఇంట్లో ఉన్న దీపా, ఆమె కుమారుడు సజీవదహనం అయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే మొదట ఈ ఘటన యాధృచ్ఛికంగా జరిగి ఉండొచ్చని పోలీసులు భావించారు. కానీ మృతురాలి బంధువులు, చుట్టుపక్కల వారిని ప్రశ్నిస్తే అసలు విషయం బయటపడింది. దీంతో సందీప్ గుప్తా భార్య, తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు.

హెచ్1-బీవీసా దరఖాస్తు రుసుము పెంపు

వాషింగ్టన్, నవంబర్9(ఆర్ఎన్ఎ) : ఇప్పటికే హెచ్ -1 బీ వీసాల జారీ నిబంధనలను కఠినతరం చేసిన అమెరికా.. దరఖాస్తు రుసుమును కూడా పెంచింది. హెచ్1 బీ వర్క్ వీసా దరఖాస్తు రుసుమును 10 డాలర్లు పెంచుతున్నట్టు ప్రకటించింది. వీసా ఎంపిక విధానాన్ని ఆధునీకరించే ప్రయత్నాలలో ఈ పెంపుదల ఒక భాగమని అమెరికా పౌరసత్వ, ఇమ్మిగ్రేషన్ సేవల విభాగం (యు.ఎస్.సి.ఐ.ఎస్) తెలియజేసింది. హెచ్-1 బీ క్యాప్ సెలక్షన్ విధానాన్ని మరింత సమర్థవంతం చేయడానికి ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్ విధానాన్ని అవలంభిస్తున్నారు. పెరిగిన ఈ రుసుము ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్ విధానానికి ఉపయోగకరంగా ఉంటుందని, తద్వారా దరఖాస్తుదారులకు, అమెరికా ప్రభుత్వానికి కూడా వేలు కలుగుతుందని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది. ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ఆధునీకరించడం ద్వారా మోసాలకు నివారించడంతో పాటు దరఖాస్తుల పరిశీలన విధానాన్ని మెరుగుపరచడం, ప్రోగ్రామ్ సమగ్రతను బలోపేతం చేయడం వీలవుతుందని పేర్కొంది. అమెరికా కంపెనీలు నిపుణులైన విదేశీ ఉద్యోగులను తాత్కాలికంగా నియమించుకునేందుకు హెచ్1బీ వీసాలు జారీ చేస్తారు.

సుప్రీం తీర్పును గౌరవించాలి : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ,నవంబర్ 9: అయోధ్య కేసులో సుప్రీంకోర్టు వెల్లడించిన తుది తీర్పుపై కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. రామజన్మభూమి - బాబ్రీ మసీదు కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అన్ని పార్టీలు, సంఘాలు, పౌరులు గౌరవించాలని ప్రియాంక ట్వీట్ చేశారు. సామరస్యం మరియు సోదరభావంతో కలిసి జీవించే భారతదేశపు పాత సంప్రదాయాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పరస్పర సామరస్యాన్ని, సోదరత్వాన్ని బలోపేతం చేయడానికి మనందరం కలిసి రావాలని ప్రియాంక పిలుపునిచ్చారు.

ప్రతి జిల్లాకు ఒక కార్మిక భవనం: మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, నవంబర్ 9: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక కార్మిక భవనాన్ని నిర్మిస్తామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కీసర మండలం నాగారంలో తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ నూతన కార్యాలయాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందన్నారు. కార్మికులందరూ లేబర్ గుర్తింపు కార్డులను తీసుకుని సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పావనిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక యూనియన్ అధ్యక్షులు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వొకేషనల్ స్కిల్ సెంటర్ ద్వారా ఉపాధి అవకాశాలు అందిస్తున్న లాంక్సెస్



ధానే, నవంబవర్9: లాంక్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తన కార్పోరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ధానేలో ఒక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేసింది. సరైన ఉపాధి అవకాశం కోసం అన్వేషిస్తున్న భవిష్యత్ అభ్యర్థులకు ఈ కేంద్రం ద్వారా శిక్షణ అందిస్తారు. ఃఒఃఒఇ స్కిల్ సెంటర్ పేరుతో లాంక్సెస్ ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని బేసిక్స్ అకాడమీ ఫర్ బిల్డింగ్ లైఫ్‌లాంగ్ ఎంప్లాయబిలిటీ లిమిటెడ్ (ఃఒఎశ్రీవ) సహకారంతో ఏర్పాటు చేశారు. ధానే, ఝగాదియా మరియు నగ్దాలో మూడు సంవత్సరాల కాలానికి నిర్వహించనున్న ఈ ప్రాజెక్ట్ కోసం ఃఒఎశ్రీవ సంస్థ అమలు భాగస్వామిగా బాధ్యతలు నిర్వహించనుంది.

ధానేలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో భాగంగా లాంక్సెస్ ఒఒ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ రైనీర్ వ్యాన్ రాయిసెల్ మరియు డాక్టర్ అన్నో బోర్కోవ్‌స్కై మరియు లాంక్సెస్ ఇండియా వైస్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ. నీలాంజన్ బెనర్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ. 5 మిలియన్ చెక్కును అందించారు. ఈ ప్రాజెక్ట్ మొదటి సంవత్సరంలో భాగంగా, ధానేలో ఏర్పాటు చేసిన కేంద్రంలో లాంక్సెస్ విజయవంతంగా 129 మంది అభ్యర్థులకు శిక్షణ అందించింది. స్విమింగ్ మెషిన్ ఆపరేషన్స్ మరియు కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో వీరికి శిక్షణ అందించారు. ఈ కోర్సులను 2019 జనవరిలో మొదలుపెట్టారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా అందించారు. ఈ శిక్షణ కోసం ఎన్‌రోల్ చేసుకున్న 78% శాతం మంది అభ్యర్థులు అంటే, 96 మంది ఈ ప్రాజెక్ట్ ముగిసిన తర్వాత కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరారు లేదా తమ సొంత వ్యాపారాలు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రవాణా, శిక్షణ, మానవ వనరులు, కేంద్రానికి చెల్లించాల్సిన అద్దె లాంటి ఖర్చుల లాంక్సెస్ మద్దతుగా నిలిచింది.

లాంక్సెస్ ఇండియా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిసరాల్లో , వాటి ఇరుగుపొరుగున ఉన్న నైపుణ్యం లేని, పాక్షిక-నైపుణ్యం కలిగిన, మధ్యలో బడి మానేసిన వారు మరియు బలహీన వర్గాలకు చెందిన యువతకు ఈ ప్రాజెక్టులో భాగంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించారు. మొదటి బ్యాచ్‌లో భాగంగా ఇప్పటికే 25 మంది అభ్యర్థులు ఈ కేంద్రంలో శిక్షణా తరగతులకు హాజరవుతున్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి లాంక్సెస్ ఇండియా వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నీలాంజన్ బెనర్జీ మాట్లాడుతూ, "కారణం ఏదైనప్పటికీ, ఉన్నత విద్యార్హత లేకపోవడం అనేది మన దేశంలోని బలహీన వర్గాల యువతకు ఉపాధి అవకాశాలు ఒక అడ్డంకి కాకూడదు. అలాంటి యువతకు మేము ఈ ప్రాజెక్ట్ ద్వారా నైపుణ్యాలు అందించే ప్రయత్నం చేస్తున్నాము.

అసెంబ్లీ ఫలితాలు బీజేపీకి ఎదురు దెబ్బే: అశోక్ గెహ్లోట్

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): మెజార్టీ సంఖ్యాబలం లేకున్నా భారతీయ జనతా పార్టీ(బీజేపీ) దేశంలోని మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ అన్నారు. కర్ణాటక, మణిపూర్, గోవాలో బీజేపీకి ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత సంఖ్యా బలం లేదన్నారు. అదేవిధంగా మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం బీజేపీకి ఎదురుదెబ్బేనన్నారు. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫలితాలు వెల్లడై రెండు వారాలు గడుస్తున్నా బీజేపీ, శివసేన ప్రభుత్వ ఏర్పాటుకు కష్టపడుతున్నాయన్నారు. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ 105 స్థానాల్లో, శివసేన 56 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీని దక్కించుకున్నా అధికార పంపిణీలో నెలకొన్న సందిగ్ధతతో ఆ రాష్ట్రంలో అనిశ్చితి కొనసాగుతుంది.

ఇకపై 2 రోజుల్లోనే ఎంఎన్‌పీ.. వేగవంతం కానున్న ప్రక్రియ..

హైదరాబాద్, నవంబర్ 9దేశవ్యాప్తంగా ఉన్న మొబైల్ వినియోగదారులకు శుభవార్త. ఇకపై ఎంఎన్‌పీ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ప్రస్తుతం ఒక టెలికాం కంపెనీ నుంచి మరొక టెలికాం కంపెనీకి వినియోగదారుడు తన మొబైల్ నంబర్‌ను ఎంఎన్‌పీ ద్వారా పోర్ట్ చేసుకునేందుకు 7 రోజుల వరకు సమయం పడుతున్న విషయం విదితమే. అయితే డిసెంబర్ 16వ తేదీ నుంచి అమలు చేయనున్న ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) నూతన నిబంధనల ప్రకారం.. కేవలం 2 రోజుల్లోనే ఎంఎన్‌పీ ప్రక్రియ పూర్తి అవుతుంది. దీంతో వినియోగదారులు ఒక నెట్‌వర్క్ నుంచి మరొక నెట్‌వర్క్‌కు ఎంఎన్‌పీ ద్వారా తమ ఫోన్ నంబర్‌ను పోర్ట్ చేయడం చాలా త్వరగా అయిపోతుంది. ఇక వేరే సర్కిల్‌లో ఉన్న నెట్‌వర్క్‌కు ఫోన్ నంబర్‌ను పోర్ట్ చేయాలంటే మాత్రం 5 రోజుల సమయం పడుతుంది. అదే సర్కిల్ అయితే 2 రోజుల్లోనే నంబర్‌ను పోర్ట్ చేసుకోవచ్చని ట్రాయ్ తెలిపింది.

గతేడాది డిసెంబర్ 13వ తేదీనే ఈ నూతన నిబంధనలను ఫైనల్ చేసినా వాటి అమలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండాలనే ఉద్దేశంతో వాటిని ఇప్పటి వరకు ట్రాయ్ ప్రయోగాత్మకంగా పరిశీలిస్తూ వచ్చింది. అలాగే టెలికాం కంపెనీలతో నూతన నిబంధనల అమలు విషయంలో ఎదురయ్యే సమస్యలపై కూడా ట్రాయ్ ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపింది. ఈ క్రమంలోనే డిసెంబర్ 16వ తేదీ నుంచి నూతన ఎంఎన్‌పీ రూల్స్ అమలులోకి రానున్నాయని ట్రాయ్ ఒక ప్రకటనలో తెలిపింది.

అయోధ్య తీర్పు.. ఐదుగురు న్యాయమూర్తులు వీరే..



న్యూఢిల్లీ,నవంబర్ 9: అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి, బాబ్రీ మసీదు భూవివాదం కేసును చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని జస్టిస్ బోబ్డే, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా శనివారం తుదితీర్పును వెల్లడించింది. మధ్యవర్తిత్వం విఫలమైన తర్వాత ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీ నుంచి రోజువారీ విచారణ చేపట్టారు. ఈ కేసులో 40 రోజుల పాటు సుప్రీంకోర్టు సుదీర్ఘంగా వాదనలు విన్నది. ఈ ఏడాది సెప్టెంబర్ 16న అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ముగిసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి భారత అత్యున్నత న్యాయస్థానం ముగింపు పలికింది. ఈ సందర్భంగా సీజేఐ రంజన్ గోగోయ్ నేతత్వంలోని జస్టిస్ బోబ్డే, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌ల వివరాలు తెలుసుకుందాం..

సీజేఐ రంజన్ గోగోయ్

అయోధ్య కేసుకు సీజేఐ రంజన్ గోగోయ్ నేతృత్వం వహించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2018, అక్టోబర్ 3న బాధ్యతలు చేపట్టారు గోగోయ్. 1954, నవంబర్ 18న జన్మించిన జస్టిస్ రంజన్ గొగోయ్ 1978 లో బార్ కౌన్సిల్‌లో చేరారు. గౌహతి హైకోర్టులో లాయర్ గా కెరీర్ ను ప్రారంభించారు. 2001లో గౌహతి హైకోర్టులో లాయర్ గా గొగోయ్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2010 లో పంజాబ్ మరియు హర్యానా హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 లో పంజాబ్-హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2012, ఏప్రిల్ 23న జస్టిస్ రంజన్ గొగోయ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. రంజన్ గోగోయ్ ఈ ఏడాది నవంబర్ 17న పదవీ విరమణ చేయనున్నారు.

జస్టిస్ శరద్ అరవింద్ బొబ్డే (ఎస్ఏ బొబ్డే)

రంజన్ గోగోయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనంలో రెండవ న్యాయమూర్తి జస్టిస్ ఎస్. ఏ బోబ్డే. 2013 లో సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు ఎస్ఏ బొబ్డే. రంజన్ గోగోయ్ పదవీ విరమణ పొందిన అనంతరం ఎస్ఏ బొబ్డే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన ఏప్రిల్ 23, 2021 న పదవీ విరమణ చేయనున్నారు.

జస్టిస్ ధనంజయ్ యశ్వంత్ చంద్రచూడ్

జస్టిస్ డి.వై.చంద్రచుడ్ 2016, మే13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, బాంబే హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేశారు. శబరిమల, భీమా కోరెగావ్, స్వలింగసంపర్కంతో సహా పలు పెద్ద కేసుల్లో ఆయన బెంచ్‌లో భాగమయ్యారు. ఆయన తండ్రి జస్టిస్ యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు.

జస్టిస్ అశోక్ భూషణ్

ఉత్తరప్రదేశ్‌కు చెందిన జస్టిస్ అశోక్ భూషణ్ 2016, మే13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిల్ లో 1979లో చేరారు. కేరళ హైకోర్టు చీఫ్ జస్టిస్ గా సేవలందించారు. అశోక్ భూషణ్ 2001 లో న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ అబ్దుల్ నజీర్

అయోధ్య కేసు బెంచ్‌లో ఉన్న జస్టిస్ అబ్దుల్ నజీర్ 1983 లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. ఆయన కర్ణాటక హైకోర్టులో లాయర్‌గా నజీర్ ప్రాక్టీస్ చేశారు. ఆ తరువాత అదనపు న్యాయమూర్తి, శాశ్వత న్యాయమూర్తిగా పనిచేశారు. 2017, ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు నజీర్.

ఈ నెల 10న నాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

హైదరాబాద్, నవంబర్ 9:: నాయీ బ్రాహ్మణ యువతీ, యువకుల వివాహ సంబంధాల కోసం పరిచయ కార్